



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 293 | ది. 1-2-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 293 | Date : 1-2-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


# పేదలు ఎదగాలి... పారిశ్రామికవేత్తలు కావాలి

- ఎంఎస్ఎంఈలు స్థాపించే డ్వాక్రా మహిళలకు బ్యాంకర్ల సహకారం అవసరం
- వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు సమావేశం

**కుప్పం,జనవరి 31 (వార్తాప్రభ) :** పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు.. వారిని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వ విధానాలు ఉంటాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కుప్పంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శనివారం వివిధ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. పథకాల లబ్దిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖీ అయ్యారు. పీ4 పథకంలోని బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ప్రతినిధులతో సీఎం సమావేశం నిర్వహించారు. అలాగే వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్ ప్రెన్యూర్ పథకంలోని లబ్దిదారులతో సంభాషించారు. అలాగే ప్రజా వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. టెక్నాలజీ వినియోగంతో వాతావరణం అంచనాలు, రియల్ టైమ్ డేటా ఎనలిటిక్స్ వంటి అంశాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు. వైద్య సేవలను ప్రజల్లోకి మరింత అందించడం.. స్క్రీనింగ్ టెస్టులకు సంబంధించిన స్టాల్స్ సందర్శించారు. ఈ ఏడాదిలో సంజీవని ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. డ్వాక్రా మహిళల ద్వారా పశుపోషణ చేపట్టి సాధికారత సాధించేలా కార్యక్రమం చేపడుతున్న స్టాల్ సందర్శించిన ముఖ్యమంత్రి అక్కడ పలువురు పాడి రైతులతో సంభాషించారు. ఆధార్ మాదిరిగా పశువుల కోసం రూపొందించిన గోధార్ ప్రాజెక్టు ప్రగతి ఎంత వరకు వచ్చిందని సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. పాడి రైతులకు తక్కువ ధరలో దాణా లభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పుట్టిన దూడలను తాము వెంటనే అమ్మేస్తామని సీఎంకు పాడి రైతులు చెప్పారు. పుట్టిన దూడలను వెంటనే అమ్మేసుకోకుండా ప్రత్యామ్నాయ విధానాలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. దాణాకు ఇబ్బంది లేకుండా గడ్డి పండించాలని సీఎం పాడి రైతులకు సూచించారు. ఇప్పుడు కుప్పంలో నీటికి ఇబ్బంది లేదు కాబట్టి... గడ్డి పెంపకం మీద దృష్టి పెడతామని పాడి రైతులు చెప్పారు.





**బంగారు మిత్రలతో బంగారు కుటుంబాలకు అవగాహన..**

కుప్పం నియోజకవర్గంలోని పీ4 పథకంలో భాగంగా ఎంపికైన బంగారు కుటుంబాలు-మార్గదర్శులతో సీఎం సమావేశమయ్యారు. కుప్పంలోని మూడు మండలాలను దత్తత తీసుకున్న మెఘా ఇంజనీరింగ్, అదానీ ఫౌండేషన్, టీవీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. రామకుప్పం మండలంలో ప్రస్తుతానికి 100 కుటుంబాలకు జీవనోపాధి చూపించామని మెఘా ఇంజనీరింగ్ ప్రతినిధి తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి వారికి మెఘా ఇంజనీరింగ్ సంస్థలో ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు. బంగారు కుటుంబాలకు ఆదాయం పెంచేలా చర్యలు చేపడుతున్నామని ఎంఈఐఎల్ ప్రతినిధి వెల్లడించారు. ప్రతి వంద కుటుంబాలకు ఓ బంగారు మిత్రను నియమించుకున్నామని... వారి ద్వారా బంగారు కుటుంబాలకు అవగాహన కల్పిస్తున్నామని మెఘా ఇంజనీరింగ్ ప్రతినిధి వివరించారు. ప్రస్తుతానికి 30 కుటుంబాలను గుర్తించి వారికి చేయూత ఇచ్చామని టీవీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి తెలిపారు. మరికొంత మంది బంగారు కుటుంబాలను అడాప్ట్ చేసుకుంటామని టీవీఎస్ తెలిపారు. తమ ప్లాంట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పీ4 పథకం తెచ్చినందుకు సీఎం చంద్రబాబుకు బంగారు కుటుంబాల ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. తల్లిని వదిలి ఉపాధి కోసం వేరే ప్రాంతానికి వెళ్లే అవసరం లేకుండా స్థానికంగా ఉపాధి పొందుతున్నామని లబ్దిదారులు సీఎంకు వివరించారు. పీ4 పథకంతో తమ జీవితాలు బాగుపడుతున్నాయని లబ్దిదారులు చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."బంగారు కుటుంబాలకు అహగాహన కల్పించేలా బంగారు మిత్రలను నియమించుకోవడం మంచి పరిణామం. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఏ మేరకు వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయొచ్చో చూడండి. దశలవారీగా పేద కుటుంబాలను వృద్ధిలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరగాలి. ఆర్థికంగా ఆదుకోవటంతో పాటు అక్షరాస్యత పెంచేలా చూడాలి, ఉపాధి కల్పించాలి. ఉద్యాన, డైరీ, సెరీ కల్చర్ లాంటి వివిధ రకాల ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి. భూమిలేని వారికి పశువుల పెంపకం లాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపండి. 500-700 కుటుంబాలను క్లస్టర్ గా మార్చి పర్యవేక్షణ చేపడితే మార్పు కనిపిస్తుంది. సమాజంలో అసమానతలను తగ్గించే ఉద్దేశ్యంతో పీ4 అమలు చేస్తున్నాం. ఆదాయార్జనకు వివిధ రకాల మోడళ్లను అమలు చేయటం ద్వారా పేదల సంపద పెంచొచ్చు. మల్టిపుల్ అప్రోచ్ విధానంలో బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను కూడా ఇంటిగ్రేట్ చేసుకోండి. త్వరలోనే యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో పేద, ధనికా తేడా లేకుండా 2.50 లక్షల వరకూ ఉచితంగా వైద్య సేవలు అందేలా ప్రణాళిక చేశాం. కుప్పంలో ఏర్పాటు కాబోయే పరిశ్రమలతో 40 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది."అని ముఖ్యమంత్రి వివరించారు.

# బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి: రేవంత్ రెడ్డి

- అమెరికా నుంచి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న ముఖ్యమంత్రి
- అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచన



**హైదరాబాద్,జనవరి 31 (వార్తాప్రభ) :** బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.




# అంబటి రాంబాబు వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయి: పార్థసారథి, వర్ల రామయ్య

- చంద్రబాబు తండ్రిని ఉద్దేశించి సమాజం సిగ్గుపడే వ్యాఖ్యలు చేశారన్న టీడీపీ నేతలు
- అంబటి చరిత్ర ఏమిటో అందరికీ తెలుసని వ్యాఖ్య
- అంబటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో జగన్ చెప్పాలని డిమాండ్



**అమరావతి, జనవరి 31 (వార్తాప్రభ) :** వైసీపీ నేత అంబటి రాంబాబుపై ఏపీ మంత్రి పార్థసారథి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తండ్రిని ఉద్దేశించి అంబటి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని అన్నారు. ఆయన వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అంబటి రాంబాబు తక్షణమే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని అన్నారు. అంబటి రాంబాబు చరిత్ర ఏమిటో ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఇలాంటి వ్యక్తి చేసిన అసభ్యకర వ్యాఖ్యలు చంద్రబాబు ఔన్నత్యాన్ని తాకలేవని చెప్పారు. అంబటి వాడిన పదజాలాన్ని ఆయన భార్యాబిడ్డలు కూడా ఛీకొడతారని అన్నారు. జగన్ భార్య భారతి గురించి మాట్లాడిన టీడీపీ నేతను అరెస్ట్ చేయించి రిమాండ్ కు పంపామని... ఇప్పుడు అంబటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ అనేది రాజకీయ పార్టీనా? లేక రౌడీల పార్టీనా? అని ప్రశ్నించారు.

## సైకిల్ కు ఓటేశారు... అభివృద్ధికి చోటిచ్చారు

- ప్రజా సంక్షేమమే కూటమికి పరమావధి
- నివాసం నుంచి ప్రజావేదిక వరకూ ఇ-సైకిల్ తో ర్యాలీగా వచ్చిన సీఎం
- కుప్పంలో పేదల సేవలో కార్యక్రమం ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు



- 8లో



## బిళ్లనపల్లి లో వైభవంగా అంకమ్మ తల్లి గ్రామోత్సవం



**హనుమాన్ జంక్షన్,జనవరి 31 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం బిళ్లనపల్లి గ్రామంలో అంకమ్మ తల్లి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అంకమ్మ తల్లి వార్షిక తిరుణాళు శుక్రవారం ప్రారంభం కాగా రెండవ రోజు అయిన శనివారం అమ్మవారికి ప్రభాతసేవ, సహస్ర కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి మేళతాళాల నడుమ బాణాసంచా కాల్చుతూ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఇంటి ముందుకు వచ్చిన అమ్మవారి వాహనానికి నీటితో వారపోసిన, భక్తులు హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొండ పావులూరి వెంకట బాబురావు, కేటీఆర్ ప్రసాద్ , హేమంత్ కుమార్, మోహన్ కుమార్ తదితరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైసీపీ అఫ్లియేటెడ్ వింగ్స్ రాష్ట్ర కార్యదర్శి గా కొలుసు మోహన్ యాదవ్



**విజయవాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** వైసీపీ అఫ్లియేటెడ్ వింగ్స్ రాష్ట్ర కార్యదర్శిగా కొలుసు మోహన్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నుంచి అధికారిక ఉత్తర్వులు విలువడ్డాయి. గన్నవరం నియోజకవర్గం కు చెందిన మోహన్ పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాలలో క్రియశీలకంగా వ్యవహారిస్తున్నారు. వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు ఈ నియామకం జరిగింది. మోహన్ నియామకాన్ని పలువురు హర్షించారు.

## పదవీ విరమణ వేళ మాట్లాడుతున్న కవి గద్వాల సోమన్న



**నందవరం,జనవరి 31 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న, సోదర కవిమిత్రుడు, తోటి ఉపాధ్యాయుడు ఆరెకటికె నాగేశ్వరావు పదవీ విరమణ సందర్బంగా కవితాగానం చేస్తూ.. శుభాకాంక్షలుతెలుపు సందర్భమని గమనార్హం. ఈ కార్యక్రమంలో మండలాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాపులపాడు మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ



**హనుమాన్ జంక్షన్,జనవరి 31 (వార్తాప్రభ) :** ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ లో భాగంగా ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గ పరిధిలోని హనుమాన్ జంక్షన్ గ్రామంలో "పేదల సేవలో" పేరుతో నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొని ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి కళ్యాణి, టీడీపీ టౌన్ పార్టీ అధ్యక్షులు అట్లూరి శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జి చిన్నాల లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ దుట్ట శివన్నారాయణ, యార్లగడ్డ సత్యన్నారాయణ, వేగుంట సత్యం, కడవకొల్లు రాజేష్, తాడిశెట్టి శ్రీను, నాగరాజు, బాషా మరియు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాపులపాడు గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ సెక్రటరీ శేష పుర్ణేశ్వరి కి ప్రతిభ అవార్డ్



**హనుమాన్ జంక్షన్,జనవరి 31 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన బాపులపాడు గ్రామ పంచాయతీ గ్రేడ్ 1 సెక్రటరీ బి. శేష పుర్ణేశ్వరిని ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచినశీదుకు,అలాగే బాపులపాడు పంచాయతీ లో విశేషమైన సేవలందించినందుకు 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం లో జిల్లా కలెక్టర్ బాలాజీ ఐ ఎ యస్, జిల్లాఎస్ పి విద్యాసాగర్ నాయుడు ఐ పి ఎస్ ,జిల్లా పంచాయతీ అధికారి అరుణ చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పలువురు అధికారులు, సిబ్బంది ఆమెను అభినందించారు.

## ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని పసుపుకొమ్ము వెంకన్నకు వైసీపీ పూజలు





**పెడన,జనవరి 31 (వార్తాప్రభ) :** పెడన పట్టణం 10వ వార్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి(పసుపుకొమ్ము వెంకన్న) వారిని దర్శించుకుని శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారు కూటమి ప్రభుత్వానికి కూటమి నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని పెడన నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఉప్పాల రాము కోరుకున్నారు. ఈ సందర్భంగా రాము మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి శ్రీవారి ప్రసాదంలో ఉపయోగించే నెయ్యి జంతువుల కొవ్వుతో కల్తీ జరిగి దానిని లడ్డూలలో ఉపయోగించి భక్తులకు ప్రసాదం అందించారని తీవ్రమైన విమర్శలు చేయడం జరిగింది. ఈ కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ సుప్రీంకోర్టుకు సమర్పించిన చార్జిషీట్లో నెయ్యిలో జంతువుల కొవ్వు ఏమి కలవలేదని పేర్కొనడం జరిగింది. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేశారని కల్తీ చేశారని అబద్ధాలను ప్రజల్లో వ్యాప్తి చేసి ప్రజల్లో భయాందోళన కలిగించారు ఇప్పుడు ప్రభుత్వం నియమించిన సిట్ సుప్రీంకోర్టుకు సంబంధించిన సమర్పించిన చార్జిషీట్లో జంతువులకు ఉపయోగించలేదు అని తెలిసినందున మళ్లీ వేరే విధంగా జగన్మోహన్ రెడ్డి గారిని దుర్భాష ఆడే విధంగా ఈ కూటమి ప్రభుత్వం వ్యవహార శైలి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు సంఘ మధుసూదన్ రావు వేముల సురేష్ మహమ్మద్ ఖాజా కటకం ప్రసాదు రాజులపాటి అచ్యుతరావు బండారు మల్లికార్జున రావు గరికపాటి రామానాయుడు కొండవీటి నాగబాబు మైలారత్నకుమారి బొడ్డు శ్యామలాదేవి ముత్యాలనాగేశ్వరావు తిరుమాని శ్రీనివాసరావు సిరివెళ్ల జయేష్ పిచ్చిక సతీష్ బాబు తుమ్మ శ్రీనివాసరావు నాయకులు కార్యకర్తలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి-ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ

- ఎంఈవో-1 పి.వి.నరసింహారావు ను ఘనంగా సన్మానించిన ఎంపీపీ





**జి.కొండూరు,జనవరి 31 (వార్తాప్రభ) :** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ అన్నారు. మండల విద్యాశాఖ అధికారి-1 పి.వి.నరసింహారావు జనవరి 31 శనివారం ఉద్యోగ విరమణ గావించారు. ఈ సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ కార్యాలయ సిబ్బంది తో కలిసి పజ్జూరు వెంకట నరసింహారావు కు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. జ్ఞాపిక ను అందజేసిన ఘనంగా వీడ్కోలు పలికారు. మండల విద్యాశాఖ అధికారిగా మండలంలో పి.వి.నరసింహారావు అందించిన సేవలు కొనియాడారు.

**ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి పి.వి. నరసింహారావు-వీరాస్వామి..** ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి పి.వి.నరసింహారావు అని మండల విద్యాశాఖ అధికారి -2 ఎం.వీరాస్వామి అన్నారు. మండల విద్యాశాఖ అధికారి-1 పి.వి.నరసింహారావు శనివారం ఉద్యోగ విరమణ గావించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, సి ఆర్ పి లతో కలిసి పజ్జూరు వెంకట నరసింహారావు కు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పి టి ఎస్ ఎన్ మూర్తి ,బి కిషోర్ , రాము, ఎం హేమరాజు, శాంతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

### -రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య



**రౌతులపూడి,జనవరి 31 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కొండ్రు మరిడియ్య మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 2016 సంవత్సరం నుండి 18 సంవత్సరం వరకు ఎంఎస్ఎఫ్డిసి ఎన్ కె ఎఫ్ డి సి స్వయం ఉపాధి పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పొందిన నిరుపేద లబ్ధిదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు జీవో నెంబర్ 319 ప్రకారం సోషల్ వెల్ఫేర్ ద్వారా అక్షరాల 4కోట్ల 86 లక్షల 85920 రూపాయలను లబ్ధిదారుల తమ మొత్తం ఏప్రియల్ 30 తేదీ లోపుగా చెల్లించిన ఎడల మాఫీ చేయుటకు ఆదేశంలో జారీ చేసినారు. ఈ సదుపాయం వినియోగించుట జీవో ఆర్టీ నెంబరు 319 ద్వారా లబ్ధిదారులు వారు అసలు పూర్తిగా చెల్లించిన వారికి సకాలంలో చెల్లించుట ద్వారా రూ.మూడు కోట్ల 89 లక్షల 20 వేలు వడ్డీ మాఫీ పొందవచ్చునని తెలిపారు అదేవిధంగా ఎంఎస్ కేఎఫ్సి పథకం 110 మంది లబ్ధిదారులు వారు అసలు 2026 సంవత్సరంలోపుగా చెల్లించుట ద్వారా 97 లక్షల 656 వడ్డీ మోపి పొందువచ్చని తెలిపారు అదేవిధంగా రాబోయే రోజుల్లో 100 కోట్లు జిల్లాకు రానున్నట్లు మీడియా ముందు మాట్లాడారు ప్రతి ఒక్కరు మాల మాదిగ నిరుపేద లబ్ధిదారులు తమ తమ సక్రమమైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మరల ఇంకా ఎక్కువ మొత్తం ప్రభుత్వం ద్వారా అలాగే సబ్సిడీ ద్వారా అందివ్వడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి బత్తిన అప్పారావు, ఎపిఎం త్రినాధమ్మ, నాగమణి, సొర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో బిసి లకు 44% శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- రాష్ట్ర, కేంద్ర బడ్జెట్ లలో జనాభా నిష్పత్తి ప్రకారం నిధులను కేటాయించాలి.



**అనంతపురం,జనవరి 31 (వార్తాప్రభ) :** కేవలం అసెంబ్లీ తీర్మానం కు మాత్రమే పరిమితం కాకుండా పార్లమెంట్ లో బి.సి. లకు 44% రిజర్వేషన్ అమలు కు బిల్లు కోసం ముఖ్యమంత్రి కృషి చేయాలని డా. పోతుల నాగరాజు డిమాండ్ బీసీలకు చట్ట సభ లలో రిజర్వేషన్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం చేసి ఆ తీర్మానం ప్రతులను పార్లమెంట్ లో చర్చ కు పెట్ట వలసిన పార్టీ లు బీసీలను నమ్మించి మోసం చేయడం కాదా? నాగరాజు యాదవ్ ప్రశ్నించారు, చేసిన ఈ ఘటన చోటు చేసుకోవడం మండలం ప్రస్తుతం ఇప్పటికే రెండు పార్టీలు ఎణా, వైస్సార్సీపీ లు ఆ పార్టీలు అధికారం లో ఉన్నప్పుడు అసెంబ్లీ లో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. కానీ వాటి అమలుకు పార్లమెంట్ లో ఎలాంటి ప్రయత్నం ఇంత వరకు చేయక పోవడానికి కారణం ఏమిటి. ఇప్పుడేబి సి లకు చట్ట సభ లలో రిజర్వేషన్ కోసం నిజాయితీగా కృషి చేయాలని కేవలం మభ్యపెట్టాలని మాత్రము చేయవద్దు అని రాష్ట్ర పార్టీ లాలు జాతీయ పార్టీ ల, నాయకులను రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు డిమాండ్ చేస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే దీజ ల ఓట్ల కోసం గాలం వేయడానికి ఇలాంటి ప్రకటనలు ఇప్పటిదాకా ఎలాంటి ప్రయత్నం పార్లమెంట్ లో చేయక పోవడం ఎంత వరకు సమంజసం అని, అదేవిదంగా బడ్జెట్ లలో కూడా జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమము కోసం నిధులను కూడా కేటాయించి రాజ్యాంగంలో పొందుపరచిన విదంగా సామజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అమలుకు అన్ని పార్టీ కట్టిబడి ఉండాలని తెలియ చేస్తూ అన్ని పార్టీ ల పార్లమెంట్ సభ్యులకు, పార్టీ అధ్యక్షులను కలసి ఈ బడ్జెట్ సమావేశంలో దీజ లకు చట్ట సభ లలో బిల్లు ప్రవేశ పెట్టె విదంగా అన్ని పార్టీల నాయకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామనీ బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు యాదవ్ డిమాండ్ చేశారు.

## రహదారి భద్రత జీవన శైలిలో భాగం



**అమలాపురం, జనవరి 31 (వార్తాప్రభ) :** జాతీయ రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ జీవన శైలిలో భాగంగా మార్చు కోవాలని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో నందు రహదారి భద్రతా మానసోత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సభకు విచ్చేసిన అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులు,విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగిస్తూ నెల పాటు కోనసీమ జిల్లాలో ముఖ్యంగా జాతీయ రహదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేం దుకు నిర్వహించిన కార్యక్రమాలు విజయవంత మయ్యా యన్నారు. రహదారి దుర్ఘటనలు ప్రతి సంవత్సరం వేలాది జీవితాలను బలి గొంటున్నయన్నారు. రహదారి దుర్ఘటనలు జరిగి, అనేక కుటుంబాలు విషాదాన్ని ఎదుర్కొన్నాయన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్టు ఉపయోగించడం, వేగ నియంత్రణ,మద్యం కార్య కలాపాలకు దూరంగా ఉండటం వంటి సాధారణ నియమాలు పాటిస్తే, మనం 80% దుర్ఘటన లను నివారించవచ్చునన్నారు. ఈ మాసంలో నిర్వహించిన అవగాహన శిబిరాలు, వాహన తనిఖీల ద్వారా చాలా మంది ప్రజలకు ఈ సందేశం చేరిందన్నారు. జిల్లాలో రహదారి భద్రతా కమిటీ లు, పోలీసు స్థానిక సం ఘాల సమన్వయంతో మాసోత్సవాలు మరింత శక్తివంతంగా జరిగాయన్నారు. ముఖ్యంగా, రైతులు, విద్యార్థులు,యువత భాగస్వాములుగా మారడం ప్రశంసనీయమన్నారు, డ్రైవర్ల అందరూ ట్రాఫిక్ పట్ల అవగాహన పెంచుకొని అప్రమత్తతో డ్రైవింగ్ చేయా లన్నారు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివా రించాలన్నారు. డ్రైవర్ల అందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి దురాలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాస్థా యిలో 15 ఉత్తమ డ్రైవర్ల కు, యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవ ర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్లు పి.భాస్కర రావు ,డి ఎల్ ఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## అంబటిపై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఫైర్



**నందిగామ,జనవరి 31 (వార్తాప్రభ) :** సీఎం నారా చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హెచ్చరిక అంబటి రాంబాబుకు హెచ్చరిక చేశారు. శనివారం తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఒక ప్రకటనలో మాట్లాడుతూ అంబటి రాంబాబుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, 24 గంటల్లో ఆయనకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబటి ప్రజాస్వామ్యంలోనే ఉన్నారా అంటూ ప్రశ్నించారు. బూతు పురాణంతో రెచ్చిపోయిన అంబటిని చూసిన రాష్ట్ర ప్రజలు అంబటి నీ రోడ్లు మీద కూడా తిరగనివ్వకుండా చేస్తారని తప్పక తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగలేదని వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన పని అని మండిపడ్డారు. కల్తీ నెయ్యి అంశంపై సిట్ ఇప్పటికే పూర్తి దర్యాప్తు సమాచారం ఇచ్చింది అని,ఎన్ డి డి బి ఇచ్చిన రిపోర్ట్ పూర్తిగా నిజం. పాలు లేకుండా నెయ్యి ఎలా వచ్చింది?" అని ప్రశ్నించారు. నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, అంబటి రాంబాబు మరియు అతని గుండా అనుచరులపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలియజేశారు. వైసీపీ గుండాలు ఇలా అడ్డగోలుగా రెచ్చిపోతే చూస్తూ ఊరుకోమని ఆమె కఠిన హెచ్చరికలు చేశారు.

## అంబటి రాంబాబు నోరు అదుపులో పెట్టుకో

- మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వీరాస్వామిన్



**నందిగామ,జనవరి 31 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని కంచల గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరాస్వామిన్ విలేకరులతో మాట్లాడుతూ అంబటి రాంబాబు బరితెగించి మాట్లాడిన భాషకు మూగజీవులు కూడా సిగ్గుపడతాయని, హద్దు పద్దు లేకుండా దుర్మార్గమైన మాటలతో బూతుల పంచాంగం నాయకులను కించపరుస్తూ మాట్లాడటం క్షమించరాని తీవ్రమైన నేరమని వీరాస్వామిన్ పేర్కొన్నారు. ఆంబోతు రాంబాబు కామాంధుడని రాష్ట్ర మొత్తం తెలుసని, పెద్ద లఫంగని, అప్రాచ్యుడు అని విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పై కుక్క లాంటి అంబటి రాంబాబు బూతుల పంచాంగం భవిష్యత్తులో ఎవరో మాట్లాడకుండా తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని వీరాస్వామిన్ ఘాటుగా ఎదురుదాడి చేశారు. అంబటి రాంబాబు పై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని శిక్షపడేలా చేయాలని వీరాస్వామి సంబంధిత అధికారులను కోరారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

### - సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్

- శ్రీవాణి విద్యాసంస్థలో రిపబ్లిక్ డే సందర్భంగా జరిగిన క్రీడా పోటీలలో విజేతలకు బహుమతు లు అందజేసిన ఎస్ ఐ



**జి.కొండూరు,జనవరి 31 (వార్తాప్రభ) :** క్రీడలు, శారీరక శ్రమ మానసిక ఉల్లాసాన్ని, శరీర దారుఢ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని జి.కొండూరు పోలీస్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని చెవుటూరు గ్రామ శివారు శ్రీవాణి విద్యాసంస్థలో రిపబ్లిక్ డే సందర్భంగా జరిగిన క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు విద్యాసంస్థ కొల్లి రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎస్ ఐ సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీర బరువును నియంత్రణలో ఉంచడం, కండరాలను బలోపేతం చేయడంలో సహాయపడతాయ న్నారు. అయితే డ్రగ్స్ కి దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఉమెన్ సేఫ్టీ,యాంటీ రాగింగ్ , డ్రంక్ అండ్ డ్రైవ్ , సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు అహగాహన కల్పించారు. సంస్థ చైర్మన్ కొల్లి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. సమయం ఎంతో విలువైనదని దానిని సద్వినియోగం చేసుకొని బాగా చదివి మంచి మార్కులు సాధించాలని పేర్కొన్నారు. అనంతరం సంస్థ యాజమాన్యం ఎస్ ఐ సతీష్ కుమార్ శాలువ కప్పి సత్కరించా రు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతమ్మ కళ్యాణం జరుగుస్థలం లో స్థలాశుద్ధి



**పెనుగంచిప్రోలు,జనవరి 31 (వార్తాప్రభ) :** ఆదివారం జరగబోవు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణము ప్రదేశము నందు స్థలశుసుద్ది వాస్తు విశేష హోమములు పూర్ణాహుతి శనివారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి బి. మహేశ్వ ర రెడ్డి,ఉత్సవ కమిటీ చైర్మన్ చుంచు రమేష్ బాబు. సభ్యులు యస్.వెంకటేశ్వరరావు, జి. రమేష్, అప్పారావు,ఆలయ ప్రధాన అర్చకులు గోపిబాబు పురోహితులు ఆంజనేయ శర్మ ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## ఆలయాలు సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయి

**-కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి,జనవరి 31 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో తృతీయ వార్షికోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ ని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ ప్రజలపై శ్రీ అభయాంజనేయ స్వామి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయాలు సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి,సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శేఖర్ సాగర,ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్,కోశాధికారి రామేశ్వరమ్మ, ఉపాధ్యక్షులు రమేష్ బాబు,మల్లేష్ ముదిరాజ్,నేతాజీ నగర్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు,సీనియర్ నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

- విశ్వకర్మ దేవుని ఆశీస్సులు సమాజానికి శ్రీరామరక్ష
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లా రెడ్డి
- భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన రాజస్థానీ విశ్వకర్మ సమాజ్ ట్రస్ట్





**కుత్బుల్లాపూర్, జనవరి 31, (వార్తాప్రభ) :** సమస్త సృష్టికి మూలకారకుడైన విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జె.కే.నగర్ (సుభాష్‌నగర్ 290 డివిజన్)లో శనివారం ఘనంగా నిర్వహించారు. రాజస్థానీ విశ్వకర్మ సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లా రెడ్డి మాట్లాడుతూ, శిల్పకళ, సృజనాత్మకత మరియు కార్మిక నైపుణ్యాలకు విశ్వకర్మ దేవుడు ప్రతీక అని కొనియాడారు. సమాజ అభివృద్ధిలో కార్మికుల, కళాకారుల కృషి వెలకట్టలేనిదని, వారి సంక్షేమానికి అందరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ, సమాజ ఐక్యతకు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు నేమిచంద్ జీ, సియారాం జీ, దేవకరణ్ జీ, తేజరాజ్ జీ, నారాయణ్ జీ, సాగర్ జీ, సి.ఎల్. శర్మ జీలు ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, రాజస్థానీ సమాజ సభ్యులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సుదీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించిన పోలీస్ అధికారుల సేవలు ప్రశంసనీయం - సిపి డాక్టర్ రమేష్

**శేరిలింగంపల్లి,జనవరి 31 (వార్తాప్రభ):**గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం. రమేష్,అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ,పదవీ విరమణ చేసిన సిబ్బందికి పూలమాలలు వేసి,శాలువాలతో సన్మానించారు.అనంతరం వారికి పెన్షన్ సంబంధిత పత్రాలను అందజేశారు.శనివారం పదవీ విరమణ చేసిన వారిలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విట్టల్ జాదవ్, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సయ్యద్ నజీర్ మియా,చందానగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎన్. కిష్టయ్య,మైలార్దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ మహమ్మద్ అయూబ్ ఖాన్ ఉన్నారు. పదవీ విరమణ చేసిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ డా. ఎం.రమేష్ మాట్లాడుతూ... సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించిన పోలీస్ అధికారుల సేవలు అభినందనీయమని అన్నారు.పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు.విధి నిర్వహణలో పోలీస్ సిబ్బందికి అండగా నిలిచిన వారి కుటుంబ సభ్యుల త్యాగాలను ప్రత్యేకంగా ప్రశంసించారు.విరమణ అనంతరం కూడా సమాజ సేవలో కొనసాగుతూ,అవసరమైనప్పుడు పోలీస్ శాఖకు తమ అనుభవాలను పంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి.అన్నపూర్ణ, ఐపీఎస్., సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీ షమీర్,అడ్మిన్ ఏఓ జ్యోతి మణి,అకౌంట్స్ ఏఏఓ శ్రీనివాసరావు,ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమాకర్,సైబరాబాద్ పోలీస్ సహకార సంఘం ఇన్‌చార్జ్ జి.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# వన దేవతల చెంత రామగుండం సింహం!!

- ఉద్యమనేత రాకతో పులకించిన పాలకుర్తి
- మొక్కులు చెల్లించుకున్న కోరుకంటి చందర్
- ప్రజలందరూ చల్లగా ఉండాలి



సమ్మక్క-సారక్కల సన్నిధిలో ప్రార్థించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 31 (వార్తాప్రభ ప్రతినిధి)**పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాల తక్కల్లపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సమ్మక్క-సారక్క దేవతలను బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రామగుండం మాజీ ఎమ్మెల్యే, ఉద్యమ సింహం కోరుకంటి చందర్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన చందర్, మొక్కులు చెల్లించుకుని నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు అలాగే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకలో నాయకులు అమ్మవార్ల కృపాకటాక్షాలు అందరికీ కలగాలని కోరుకున్నారు. దేవాలయ ప్రాంగణం అంతా భక్తుల కోలాహలం సమ్మక్క-సారక్క నామస్మరణతో మారుమోగింది. చివరగా ఆలయ కమిటీ వారు కోరుకంటి చందర్ ను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఆర్జీ-1 ఏరియాలో ఆధ్యాత్మిక శోభ!!

- వైభవంగా దుర్గా మాత ఆలయ వార్షికోత్సవం
- అమ్మవారి ఆశీస్సులతో కార్మిక లోకం చల్లగా ఉండాలి
- రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్





**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 31 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం ఏరియా-1 వర్క్ షాప్ ఆవరణలోని శ్రీ దుర్గా మాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘనస్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్మికులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, సింగరేణి సంస్థ మరింత ప్రగతి సాధించాలని ఈ సందర్భంగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, జెట్టి శంకర్ రావ్, వైస్ ప్రెసిడెంట్ సదానందం, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి దాస్, జాయింట్ జనరల్ సెక్రటరీ రాజేందర్, సెక్రటరీ నవీన్, పిట్ సెక్రటరీలు శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొని భక్తిని చాటుకున్నారు. వీరితో పాటు నాయకులు తిరుపతి గౌడ్, వెంకటేశ్వర్లు అలాగే పెద్ద సంఖ్యలో కార్మికులు, భక్తులు పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో సంతరించుకుంది. వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన అన్నదాన కార్యక్రమం, భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి అరెస్ట్.

- 6 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- దుండిగల్, బాచుపల్లి పరిధిలో పగటిపూట ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలు
- గండిమైసమ్మ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్న దుండిగల్ క్రైమ్ టీమ్



**దుండిగల్, జనవరి 31, (వార్తాప్రభ) :** దుండిగల్ మరియు బాచుపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా పగటిపూట ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి సుమారు 6 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 19వ తేదీన బాచుపల్లి పరిధిలో ఒక ఇంట్లో పగటిపూట తాళం పగులగొట్టి బీరువాలోని బంగారం, వెండి, నగదును నిందితుడు ఎత్తుకెళ్లాడు. అదేవిధంగా, జనవరి 25న దుండిగల్ మండలం మల్లంపేట్ పరిధిలో మధ్యాహ్నం సమయంలో మరో ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. ఈ చోరీలపై నిఘా పెట్టిన దుండిగల్ క్రైమ్ టీమ్.. గురువారం (జనవరి 29) సాయంత్రం గండిమైసమ్మ ఎక్స్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు లచ్చపేట గ్రామం, మాచారెడ్డి మండలం, నిజామాబాద్ జిల్లా. కు చెందిన జుకాంటి ప్రకాష్ రెడ్డి (28) అని, గతంలో మాచారెడ్డి, దుబ్బాక, మేడ్చల్, బోధన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా పలు నేరాలు చేసిన పాత నేరస్తుడని తేలింది. నిందితుడు దొంగిలించిన నగలను విక్రయించడానికి జ్యువెలరీ షాపుల వద్ద తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు.

# అణగారిన వర్గాల ఉన్నతికి జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గద్దర్





**శేరిలింగంపల్లి,జనవరి 31 (వార్తాప్రభ):**ప్రజాగాయకుడు, విప్లవకవి గద్దర్ జయంతి సందర్భంగా శనివారం తెల్లాపూర్‌లో కొల్లూరు భరత్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్,ఎంబీసీ చైర్మన్ జరిపటి జైపాల్,వెన్నెలక్క సాంస్కృతిక సారథి చైర్మన్,బీసీ ఐక్య వేదిక నాయకులు బేరి రామచందర్ యాదవ్,రాజు నాయక్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ విప్లవ గీతాలు,దళిత--బహుజన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన నిరంతర పోరాటాన్ని స్మరించుకుంటూ నాయకులు ఘన నివాళులు అర్పించారు. గద్దర్ తన జీవితాన్ని సామాజిక న్యాయం,సమానత్వం, అణగారిన వర్గాల విముక్తికే అంకితం చేశారని వారు పేర్కొన్నారు.అనంతరం కొల్లూరు భరత్ నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈ.రాజు,గడ్డం శ్రీకాంత్,ఎం.రాజు ,సత్యనారాయణ, దుర్గాప్రసాద్,వేణు,అరవింద్, విష్ణు,పవన్,రాకేశ్,తెల్లాపూర్ ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్ జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు, ఈ ఆర్ ఓ లు, సబ్ కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలని, ఓటరు జాబితాలో గల ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారి తరపున బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని తెలిపారు.జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## మౌలిక వసతులు అభివృద్ధికి నిధులు కేటాయించండి

**మేయర్ కు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి వినతి**



**శేరిలింగంపల్లి,జనవరి 31 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు.జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్‌ను కలిసిన ఆయన,ఖాజాగూడ ప్రాంతంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.డంపింగ్ యార్డును తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వినతి చేశారు.దీనిపై మేయర్ సానుకూలంగా స్పందించి,తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అలరించిన డా. విన్నీల రావు శిష్యుల కూచిపూడి నృత్య ప్రదర్శన





**శేరిలింగంపల్లి,జనవరి 31 (వార్తాప్రభ):** శిల్పారామం మాదాపూర్‌లో చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన హస్తకళ ఉత్సవ్ "గాంధీ శిల్ప బజార్" ఘనంగా ముగిసింది.గత పది రోజులుగా నిర్వహించిన ఈ మేళకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలి వచ్చి హస్తకళాకారులను ప్రోత్సహించారు.ఈ మేళలో ట్రైబల్ కళాకారుల తయారు చేసిన బస్తర్ మెటల్ క్రాఫ్ట్, మెటల్ జ్యువలరీ,గృహోపకరణాలు,చీరలు, డ్రెస్ మెటీరియల్స్ తదితర ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మేళ ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ విన్నీల రావు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించింది. రామాయణ శబ్దం,ధనశ్రీ తిల్లాన, భో శంభో, జతిస్వరం,రాజా రాజేశ్వరి, బృందావన నిలయే, బ్రహ్మాంజలి, కొలువైతివారంగా సాయి,ఒకపరి కొకపరి,చందన చర్చిత, ప్రహ్లాద పట్టాభిషేకం, అతి నిరుపమా,శివ తాండవం వంటి అంశాలను నృత్య రూపంలో ప్రదర్శించి అభినందనలు పొందారు.ఈ కార్యక్రమాల్లో గాయత్రీ,రాణీత,అనన్య,హంసిక,లక్ష్మీ ప్రసన్న,ఆరాధ్య ,గీతికా, యోషా,పూర్వీక,అక్షర,వివేకా,శివాని తదితర కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు.

## ఘనంగా శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి రెండవ వార్షికోత్సవ వేడుక



**శేరిలింగంపల్లి,జనవరి 31 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గుల్మోహన్ పార్క్,నేతాజీ నగర్‌లో గల శ్రీశ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ రెండవ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.శనివారం ఆలయ కమిటీ అధ్యక్షులు డా. ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి.తెల్లవారుజామున బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ,నల్ల పోచమ్మ,శివ నాగేంద్ర స్వామి దేవాలయాల్లో అర్చనలు చేపట్టారు.అనంతరం హనుమాన్ దేవాలయంలో విఘ్నేశ్వర పూజలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.వేద బ్రాహ్మణులు హనుమాన్ విగ్రహానికి అభిషేకం నిర్వహించి హోమం చేశారు.ఈ కార్యక్రమాలకు కాలనీవాసులు,పరిసర ప్రాంతాల భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్,గచ్చిబౌలి కార్పొరేటర్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్,ఉరిటి వెంకటరావు, రాగం మల్లికార్జున్ యాదవ్, శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్,సురేందర్,కమిటీ ప్రధాన కార్యదర్శి ఆశనోళ్ళ వెంకటేష్ గౌడ్,కోశాధికారి రామేశ్వరం రెడ్డి,ఉపాధ్యక్షులు ఏ.మల్లేష్ ముదిరాజ్,ఎం.సంతోష్ కురుమ,ఆర్.రమేష్ బాబు, సంయుక్త కార్యదర్శులు ఎం. మహేష్ కురుమ,బుచ్చన్న, ఉప్పరి దయాసాగర్,కార్యనిర్వాహక కార్యదర్శులు లావా చారి,యాదగిరి సాగర్, ఎం.శ్రీను కురుమ,సాంబరాజు,కార్యవర్గ సభ్యులు పి.నర్సిరెడ్డి, సోమేశ్ రెడ్డి,డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## ముద్రగడ రెండో వైపు చూస్తున్నారా ?

ముద్రగడ పద్మనాభం తూర్పు గోదావరి జిల్లాలో ప్రముఖ రాజకీయ నాయకుడు. బాగా పట్టు ఉన్న ఒక సామాజిక వర్గానికి ఆయన చాలా కాలం పాటు ప్రాతినిధ్యం వహించారు. అంతే కాదు వారి కోసం అతి పెద్ద ఉద్యమం చేశారు. ఈ క్రమంలో తన రాజకీయ జీవితంలో ముఖ్యమైన కాలాన్ని అంతా ఖర్చు చేశారు. నిజంగా ముద్రగడ చేసిన ఈ త్యాగం మెచ్చ తగినది. దానికి తగిన ప్రతిఫలం అయితే ఆయనకు దక్కలేదు. ఇక చూస్తే ఇపుడు గోదావరి జిల్లాలలో కాపులకు మరో బలమైన నేతగా ఆరాధ్య నాయకుడిగా పవన్ కళ్యాణ్ కనిపిస్తున్నారు. పవన్ వైపు నుంచి చూస్తే ఆయన అందరి వాడుగా ఉంటున్నారు. కానీ ఆ సామాజిక వర్గం ఆయనను సొంతం చేసుకుంది.ముద్రగడ కూడా ఏడు పదుల వయసులో ఉన్నారు. దాంతో ఆయన మార్క్ రాజకీయం దూకుడుకు కాలం చెల్లిందా అన్న చర్చ కూడా ఉంది. ఎందుకంటే కొత్త తరం అన్ని వైపుల నుంచి వచ్చేసింది. ముద్రగడ కూడా రాజకీయంగా కొన్ని రాంగ్ స్టెప్స్ వేశారని విమర్శలు ఉన్నాయి. ఏటికి ఎదురీదారని దాంతోనే ఆయన 2024 ఎన్నికలో వైఫల్యం మూటకట్టుకున్నారని అంటున్న వారూ ఉన్నారు. ఆ సమయంలో కూటమి ప్రభంజనం ఉంది. అదే విధంగా జనసేన ప్రభావం గోదావరి జిల్లాలను కమ్మేసింది. పవన్ కళ్యాణ్ ని ఆరాధిస్తున్న బలమైన సామాజిక వర్గం ఒక వైపు ఉంటే ఆయన్ని ఓడిస్తాను అని వైసీపీలో చేరి ముద్రగడ పెద్ద తప్పు చేశారు అని ఆ సామాజిక వర్గానికి చెందిన వారు అభిప్రాయపడుతూ ఉంటారు.ఇదిలా ఉంటే ముద్రగడ పద్మనాభం తాజాగా తమ జిల్లాకు చెందిన సీనియర్ టీడీపీ నేత మాజీ ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తో భేటీ అయ్యారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీగానే బయటకు వచ్చింది. అయితే ఇక్కడే అనేక రకమైన కథలు ప్రచారంలోకి వస్తున్నాయి. ఇందులో వాస్తవాలు ఏమి ఉన్నాయన్నది పక్కన పెడితే ఇవి ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయని చెప్పాలి. ముద్రగడ తిరిగి కూటమి వైపు చూస్తున్నారు అని అందులో భాగంగానే ఆయన చిన రాజప్పతో పెద్ద మీటింగ్ పెట్టారని కూడా పుకార్లుగా షికార్లు గోదావరి తీరమంతా చేస్తూ వస్తున్నారు.ముద్రగడ రాజకీయంగా చూడాల్సింది చూసేశారు. ఆయన గత ఏడాది తీవ్రమైన అనారోగ్యం నుంచి కోలుకున్నారు. ఒక విధంగా ఆయన ప్రత్యక్ష రాజకీయాలను గతంలో మాదిరిగా చేసే విధంగా లేరని అంటారు. అయితే ముద్రగడ ఆలోచనలు అన్నీ కూడా తన కుమారుడు గిరి కోసమే అని అంటున్నారు. ఆయనకు రాజకీయంగా భవిష్యత్తు చూపించాలని ఆయన ఆరాటపడుతున్నారని ప్రచారం అయితే సాగుతోంది. వైసీపీలో ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ ఇంచార్జిగా గిరిని నియమించారు. ఇక ఈ సీటు ముద్రగడ సొంత సీటు. ఆయన తండ్రి ముద్రగడ వీర రాఘవరావు రెండు సార్లు ఇండిపెండెంట్ గా గెలిచారు. ముద్రగడ ఇదే సీటు నుంచి నాలుగు సార్లు వరుసగా గెలిచారు. ఆ సీటు నుంచి 2029 లో గిరిని పోటీ చేయించి ఎమ్మెల్యేగా చూసుకోవాలని ఆయన కోరుకుంటున్నారని అంటున్నారు.వైసీపీ నుంచి పోటీ చేస్తే విజయావకాశాలు ఏ విధంగా ఉంటాయో అన్నది కూడా ఉంది అని అంటున్నారు. ఎందుకంటే గోదావరి జిల్లాల రాజకీయం ఇప్పటికీ జనసేన టీడీపీ కూటమికి కట్టుబడిపోయింది. ఏ మాత్రం మార్పు అయితే అక్కడ రావడం లేదు, దాంతో కూటమి వైపుగా కుమారుడిని పంపించాలని ముద్రగడ ఆలోచిస్తున్నారా అన్న ప్రచారం అయితే సాగుతోంది. మరి ఈ పుకార్లలో నిజాలు ఏ మేరకు ఉన్నాయో చూడాలి.

## "అన్నవరం."అన్నార్థుల ఆశాకిరణం అన్న ఎన్టీఆర్

### పేదలకు అందించిన గొప్ప వరం సామాజిక పింఛన్ పధకం - చింతల



**పెనుగంచిప్రోలు, జనవరి 31( వార్త ప్రభ)** ఆనాడు ఎన్టీఆర్ 35 రూపాయలతో ప్రారంభించబడి నేడు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 4000,/- 6000/-, 15000/- ఎక్కువ పింఛన్ ఇవ్వడానికి ప్రధాన భూమిక వహించినది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం ప్రభుత్వం.ఆనాడు ఎన్టీఆర్ వేసిన బాట ఈరోజు దేశ మంతటా దిక్చూచి అయ్యింది. ఈ పథకం కూడు, నీడ, గుడ్డ నినాదం తెలుగుదేశం.పేదవానికి పట్టెడు అన్నం పెట్టడమే తెలుగు దేశం పార్టీ ఆశయం అని పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య అన్నారు. శనివారం పెనుగంచిప్రోలు గ్రామం లో 13 వార్డు లో 8 వార్డు లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో కార్యక్రమంలో పాల్గొన్న సందర్బంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మాదల శ్రీనివాసరరావు,సచివాలయ సిబ్బంది రామాచంద్ర రావు,అంగన్వాడీ టీచర్ దామాల వాణి పాల్గొన్నారు..

## గుత్తి లో పింఛన్ తీసుకున్న అరగంటకే వ్యక్తి మృతి



**గుత్తి జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గుత్తిలోని బీసీ కాలనీలో విషాదం నెలకొంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతాప్ రెడ్డి అనే వ్యక్తి శనివారం ఉదయం పింఛన్ తీసుకున్న అరగంటకే ప్రాణాలు విడిచారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మీయ చేతుల మీదుగా ఆయన పింఛన్ నగదు అందుకున్నారు. ఒకరోజు ముందుగానే పింఛన్ అందిన ఆనందంలో ఉన్న ఆ కుటుంబంలో, ప్రతాప్ రెడ్డి హఠాన్మరణం తీవ్ర విషాదాన్ని నింపింది.

# రాధాకృష్ణ సేవలు అమోఘం





**విజయవాడ పశ్చిమ, జనవరి 31 :- (వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తపేట ఎస్ కే పి వి వి హిందూ హైస్కూల్లో 42 సంవత్సరాలుగా రికార్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించిన బెహరా రాధాకృష్ణ పాఠశాల అభివృద్ధికి అందించిన సేవలు అమోఘమని ఎస్ కే పి వి వి హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య కొనియాడారు. రాధాకృష్ణ పదవీ విరమణ కార్యక్రమం పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షత పాఠశాల సెక్రటరీ కే ఎల్ వి మోహనరావు వ్యవహరించగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది ఉండబట్టే సుమారు 125 ఏళ్లుగా హిందూ హైస్కూల్ అప్రతిహ ప్రస్థానాన్ని కొనసాగిస్తుందన్నారు. అనంతరం హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి డాక్టర్ గోళ్ళ బాబా విజయ్ కుమార్, కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ తూనికుంట్ల శ్రీనివాస్, హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ వి. నారాయణరావు, 39 డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీవ కార్పొరేటర్ మండెపూడి చటర్జీ, ఎంఈవో 2 సోమశేఖర్ నాయక్ , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల ప్రతినిధి బ్రహ్మేశ్వర రావు తదితరులు రాధాకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

# విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి






**విజయవాడ పశ్చిమ జనవరి 31:(వార్తా ప్రభ ప్రతినిధి)**వినియోగదారుల అవసరాలు, సమస్యలు మొదలైనవాటిని అధ్యయనం చేసి, వాటికి పరిష్కారం చూపేందుకు విద్యార్థులు వివిధ రకాలైన స్టార్టప్ లను ప్రారంభించడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఫెసిలిటేటర్ దోనేపూడి రవితేజ అన్నారు. కెబిఎన్ కళాశాల ఐహబ్, ఆర్ టి ఇ హెచ్ సంయుక్త ఆధ్వర్యంలో 'అవర్ ఫ్లాగ్ షిప్ ఐడియా ఎక్స్ ప్లోరేషన్ ప్రోగ్రాం ఫర్ స్టార్టప్ ఎన్థ్యూసియాస్ట్స్' పేరుతో నిర్వహించిన ఐదురోజుల బూట్ క్యాంపు శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవితేజ మాట్లాడుతూ బిజినెస్ మోడల్స్, ఆదాయ మార్గాలు, ఖర్చుల నిర్మాణం, మార్కెటింగ్ ఛానల్స్ వంటి కీలక అంశాలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఆలోచన చిన్నది అని భావించకూడదని, ఏ ఆలోచనను అయినా సరైన మార్గంలో పెడితే అద్భుతమైన ఆవిష్కరణ సాధ్యమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ సమస్య గుర్తింపు, వినియోగదారుల అవసరాల విశ్లేషణ, సరైన పరిష్కార రూపకల్పన, ప్రత్యేక విక్రయ లక్షణాలు, పోటీ విశ్లేషణ వంటి అంశాలను ప్రాయోగికంగా నేర్చుకునే అవకాశం ఈ క్యాంపు ద్వారా కలుగుతుందన్నారు. హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ఉద్యోగాలు తీసుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించేస్థాయికి విద్యార్థులు ఎదగాలన్నారు. ఐ హబ్ సమన్వయ కర్త జె.బాలాజీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధృవపత్రాలను అందించారు.

# ఇంద్రకీలాద్రిపై ఘనంగా ఉద్యోగుల పదవీ విరమణ



**విజయవాడ పశ్చిమ జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి పై సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల వీడ్కోలు సభ శనివారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. మల్లేశ్వర మహా మంటపంలోని 6వ అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొని రిటైర్ అవుతున్న సహచర ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.?భక్తుల సేవలో తరించడం వీరి అదృష్టమని?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బండారు రాంబాబు అన్నారు. పదవీ విరమణ పొందుతున్న శ్రీ పి. ప్రసాద్ (డ్రైవర్) ,శ్రీమతి ఎం. ఆదిలక్ష్మి (రికార్డ్ అసిస్టెంట్) ల సేవలను కొనియాడారు.?లోకమాత కనకదుర్గమ్మ సన్నిధిలో దశాబ్దాల కాలం పాటు విధులు నిర్వహించడం సామాన్యమైన విషయం కాదని, ఇది వారి పూర్వజన్మ సుకృతమని ఆయన పేర్కొన్నారు.?ఎంతోమంది భక్తులు వచ్చే ఈ పుణ్యక్షేత్రంలో, నిరంతరం అంకితభావంతో పనిచేసి ఏ మచ్చా లేకుండా పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు.?పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను దేవస్థానం మర్యాదలతో, శాలువాలు మరియు జ్ఞాపికలతో అధికారులు ఘనంగా సత్కరించారు. అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేసి వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.?ఈ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న సిబ్బంది మాట్లాడుతూ.. అమ్మవారి సేవలో ఇన్నేళ్లు గడపడం తమ జీవితానికి దక్కిన గొప్ప వరమని, అధికారుల సహకారం మరువలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ బి వి రెడ్డి, ఎన్. రమేష్ బాబు, డాక్టర్ కె. గంగాధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి. కోటేశ్వరరావు, పర్యవేక్షకులు డివివి సత్యనారాయణ, రాజు, ట్రాన్స్పోర్ట్, ఇంజినీరింగ్ సిబ్బంది మరియు అర్చక స్వాములు పాల్గొన్నారు.

# 40 సూచికల్లోనూ 100 శాతం ప్రగతికి సమష్టి కృషి

***- మరో ఆరు సూచికల్లో శత శాతం లక్ష్యంగా***

***సంపూర్ణతా అభియాన్ 2.0***

***జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ శా***




**ఇబ్రహీంపట్నం జనవరి 31(వార్తా ప్రభ ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వ ఆకాంక్షిత బ్లాకు అయిన ఇబ్రహీంపట్నంలో సంపూర్ణతా అభియాన్ తొలిదశ కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ స్ఫూర్తితో సంపూర్ణతా అభియాన్ 2.0ను ప్రారంభించినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.ఇబ్రహీంపట్నం మండల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన సంపూర్ణతా అభియాన్ 2.0 ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆకాంక్షిత బ్లాకులు అయిన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలులో సంపూర్ణతా అభియాన్ తొలిదశ కార్యక్రమంలో భాగంగా ఆరు ముఖ్య సూచికల్లో 100 శాతం ప్రగతి సాధించాయని.. ఇప్పుడు మరో ఆరు కీలక సూచికల్లో 100 శాతం లక్ష్యాల సాధనకు సంపూర్ణతా అభియాన్ రెండోదశ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. విద్యాశాఖకు సంబంధించి అన్ని పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడం, పశుసంవర్ధక శాఖకు సంబంధించి అన్ని పశువులకు నోటిపూత వ్యాధి నివారణ టీకాలు వేయించడంలో శత శాతం ప్రగతి సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆరు సూచికల్లో ఇప్పటికే మెరుగైన ప్రగతి ఉందని.. అయితే శతశాతం అనేది కార్యక్రమం లక్ష్యమన్నారు. లక్ష్యాల సాధనకు అవసరమైన సహాయసహకారాలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ఈ సూచికల్లో పురోగతి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆకాంక్షిత బ్లాకులను ఆదర్శ బ్లాకులుగా తీర్చిదిద్దేందుకు వివిధ శాఖలు, ఫ్రంట్ లైన్ వర్కర్లు, ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

# మైనారిటీల పై కూటమి ప్రభుత్వం వివక్ష

### వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి మైనారిటీ బాజీ

**ఇబ్రహీంపట్నం, జనవరి31(వార్తా ప్రభ ప్రతినిధి):** ముఖ్యమంత్రి చంద్రబాబుని మంచిబుద్ధి ప్రసాదించాలని కొండపల్లి ప్రసిద్ధిగాంచిన సూఫీ మత గురువు హజ్రత్ సయ్యద్ షాబుఖారీ బాబా దర్గా లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి మైనారిటీ బాజీ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటమీ ప్రభుత్వం మైనార్టీల పట్ల వివక్షత చూపిందని మండిపడ్డారు. మ్యానిఫెస్టోలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో విజయవాడ నడిబొడ్డున రాష్ట్ర హజ్ హౌస్ నిర్మాణం ,ముస్లిం మైనారిటీలకు 50 సంవత్సరాలకే పెన్షన్,మైనారిటీలకు ముఖ్య పట్టణాలలో ఈద్గాలకు ఖబరస్తాన్లకు స్థలాలు కేటాయింపు,రాష్ట్రంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్రంలో మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్ ఏ విధంగా ఎంత ఖర్చు పెట్టారో శ్వేత పత్రం విడుదల చేయాలని బాజీ బాబా డిమాండ్ చేశారు.

## రాష్ట్ర వైసీపీ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి గా దేవర సురేష్ బాబు యాదవ్ నియామకం



**విజయవాడ పశ్చిమ జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజ కవర్గ ప్రాంతానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు దేవర సురేష్ బాబు యాదవ్ ఎదురు చూపులు ఎట్టికేలకు ఫలించాయి. రాష్ట్ర వైసీపీ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి గా ఆయన నియ మితులైయ్యారు. రాష్ట్రంలో వైసీపీ కి ప్రతికూల పరిస్థితులు నెలకొన్నా ఎలాంటి ప్రలోభాలకు, వత్తిడికి లోనవ్వకుండా పార్టీ ని నమ్ముకొని ఉన్న ఆయనకు పార్టీ అధిష్టానం గుర్తించి సముసిత స్తానం కల్పించడం పట్ల ఆయన వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.2004 నుంచి వైఎస్ఆర్ గారి అభిమానిగా మెలుగుతూ వైసీపీ అధినేత అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని కృషిచేసిన తాను అలాగే రాజశేఖర్ రెడ్డి మరణానంతరం జగన్ తో ఆయన పెట్టిన వైఎస్ఆర్ పార్టీలో నడుస్తూ పార్టీ పరంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నాను. తనకు ఈ రోజున పార్టీ తగిన గుర్తింపు ఇచ్చినందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డి కి ,మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావుకి వై వి సుబ్బారెడ్డికి గ్రీవెన్స్ సెల్‌రాష్ట్ర కమిటీ అధ్యక్షులు నవరత్నాల నారాయణరావు కి కృతజ్ఞతలు తెలియజేయుచున్నానని దేవర సురేష్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని.....పార్టీ బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సురేష్ బాబు హామీ ఇచ్చారు.

## పొట్నూరి అజయ్ కుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా క్యాన్సర్ పేషెంట్లకు నిత్యవసర సరుకులు పంపిణీ





**విజయవాడ పశ్చిమ జనవరి 31:(వార్తా ప్రభ ప్రతినిధి)**దివంగత పొట్నూరి అజయ్ కుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన సోదరుడు పొట్నూరి కృష్ణ కేశవ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బ్రాహ్మణ వీధిలో నీ ఆయన నివాసం వద్ద పలువురు క్యాన్సర్ పేషెంట్లకు బియ్యం, నిత్యవసర సరుకులు, పండ్లు, దుస్తులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ కేశవ మాట్లాడుతూ తన సోదరుడు అజయ్ కుమార్ క్యాన్సర్ వ్యాధితో మృతి చెందటం తన కుటుంబానికి తీరని లోటని చెప్పారు. అందుకే అజయ్ కుమార్ వర్ధంతి సందర్భంగా పేదలకు తమ చేతనైనంత సాయం అందజేస్తున్నామని ఆయన చెప్పారు. అలాగే ఈ ఉదయం గుణదలలోని మదోనా డెఫ్ అండ్ డమ్ హైస్కూల్లో స్కూలు పిల్లలకు భోజనం పుస్తకాలు , స్టేషనరీ , పండ్లు అందజేయడం జరిగిందన్నారు. అలాగే ఆర్టీసీ వర్క్ షాప్ లో రోడ్డు లోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుస్తులు, భోజనాలు, పండ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే క్యాన్సర్ పేషెంట్లకు గత సంవత్సర కాలంలో లక్షలాది రూపాయల ఆర్థిక సహాయాన్ని కూడా అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు కొప్పుల గంగాధర రెడ్డి, 52 డివిజన్ అధ్యక్షులు ఈగల సాంబశివరావు, 53వ డివిజన్ జనసేన అధ్యక్షులు పులిచేరి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన పశ్చిమ తహశీల్దార్ దాసరి రిబ్కా రాణి



**విజయవాడ పశ్చిమ జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని భవానిపురం మానవ మందిర్ రోడ్డు లో 122 వ,సచివాలయంలో పరిధిలో లబ్ధిదారులకు పశ్చిమ తహసీల్దార్ దాసరి రిబ్కా రాణి శనివారం ఉదయం పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం పలుచోట్ల పొగమంచు వల్ల సర్వర్లు అప్పుడప్పుడు మొరా యించాయి. మంచులో వణుకుతున్న గాని అన్ని సచివాల యాల పరిధిలోని వెల్ఫేర్ సెక్రటరీ లు ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. 1 వ తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులకు ఒక రోజు ముందు పింఛన్లు అందడం తో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. 122 వ,సచివాలయం పరిధిలో పింఛన్లు పంపిణీ లో పశ్చిమ తహసీల్దార్ దాసరి రిబ్కా రాణి తో పాటుగా స్థానిక వెల్ఫేర్ సెక్రటరీ శ్రీను కూడా పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించరాదు

### - నగర డి.ఎస్.పి సిహెచ్ రాజా.



**మచిలీపట్నం జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పదవ తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాల నేపథ్యంలో శబ్ద నియంత్రణకు పోలీసుల సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించేలా అనుకూల వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని జిల్లా పోలీస్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రార్థనా స్థలాల వద్ద(దేవాలయాలు, మసీదులు ,చర్చిలు) వద్ద పరిమితికి మించి శబ్దాలు చేస్తూ మైకుల వినియోగం చేయవద్దని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించే విధంగా శబ్ద కాలుష్యానికి పాల్పడకూడదని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ, రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు 'సైలెన్స్ అవర్స్'గా పరిగణించి, పరీక్షలు పూర్తయ్యే వరకు మైకులు, లౌడ్ స్పీకర్లు, సౌండ్ సిస్టమ్స్ ఉపయోగించి ప్రార్థనలు లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా పోలీస్ శాఖ ప్రజలను కోరారు.

# రైల్వే ప్రయాణికుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం.

**దక్షిణ మధ్య రైల్వే జి.ఎం. సంజయ్ కుమార్ శ్రీవాత్సవ్.**

**మచిలీపట్నం జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ వాత్సవ్ శనివారం మచిలీపట్నం రైల్వే స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మచిలీపట్నం ప్రయాణికుల పలు సమస్యలను వ్రాత పూర్వకంగా ఆయనకు తెలిపారు. ముఖ్యంగా ఎంతో కాలంగా రద్దు అయిన మచిలీపట్నం నుండి తిరుపతి రైలును వెంటనే పునరుద్ధరించాలని బాలాజీ కోరారు. వారానికి ఒకరోజు ఉన్న షిరిడి రైలు వారానికి మూడు రోజులు ఏర్పాటు చేయాలని, ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న మచిలీపట్నం ముంబై రైలు కూడా ఏర్పాటు చేయాలని బాలాజీ కోరారు. ప్రతిరోజు విశాఖపట్నం నుండి వచ్చే రైలు గుడివాడలో గంటకు పైగా నిలిపివేసి ప్రయాణికులు ఇబ్బందులు కలగజేస్తున్నారని, మచిలీపట్నంలో లిఫ్టు, ఎస్కలేటరు లేకపోవటం వలన లగేజ్ తో ఉన్న ప్రయాణికులు వృద్ధులు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే లిఫ్టును ఏర్పాటు



చేయాలని బాలాజీ కోరారు. మచిలీపట్నం నూతన రైల్వే స్టేషన్ లో రైల్వే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో మచిలీపట్నం వచ్చే రైలులో పోలీసు పర్యవేక్షణ ఉండాలని బాలాజీ కోరారు. 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన మచిలీపట్నం రైల్వే స్టేషన్ బ్రిటిష్ కాలంలో మార్మగోవా వరకు రైలు నడిపిందని కాలానుగుణంగా పలు రైలు రద్దు కావడం వలన రైల్వే ప్రయాణం ఇబ్బంది పడుతున్నారని బాలాజీ తెలియజేశారు. జిల్లా ముఖ్య కేంద్రంలో ఉన్న మచిలీపట్నం రైల్వే స్టేషన్ మచిలీపట్నం, పామర్రు, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాలకు చెందిన సుమారు పది లక్షల మందికి అనుకూలం ఉండే స్టేషన్ అని బాలాజీ తెలియజేశారు. మచిలీపట్నం రేపల్లె మార్గానికి వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని బాలాజీ కోరారు. పినాకిని, శాతవాహన రైలులో ఒక రైలు ని మచిలీపట్నం నుంచి బయలుదేరే విధంగా చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. అన్ని సమస్యలపై జిఎం సంజయ్ కుమార్ స్పందించి త్వరితగతిన అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో లంకిశెట్టి తో పాటు నోబెల్ కాలేజీ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు న్యాయవాది జే. సువర్ణ రాజు అరేసేపల్లి సొసైటీ మాజీ సీఈవో ఎం. వి.వి. రామాంజనేయులు బాబు, సామాజిక కార్యకర్త సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# వెలుగు సంస్థ ద్వారా లబ్ధిదారుడికి ఎగ్ కార్ట్ స్టాల్ అందజేత

**మహిళలకు అండగా టిడిపి ప్రభుత్వం...**

**మండల అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్**

**చేజర్ల జనవరి 31 (వార్తాప్రభ)** మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలతో కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు సహకారంతో మండల కేంద్రమైన చేజర్ల గ్రామంలో డిఆర్డిఏ వెలుగు సంస్థ ద్వారా సయ్యద్ మసీర ఇస్మాయిల్ అనే గ్రూప్ లబ్ధిదారునికి శనివారం ఎగ్ కార్ట్ (ఎగ్ ఫ్రైడ్ రైస్ స్టాల్) సుమారు 50 వేలు రూపాలతో తయారు చేయబడిన స్టాల్ 35 వేలు సామాగ్రి 15 వేలు మొత్తం 50 వేలు రూపాయలు కూటమి ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా లబ్ధిదారునికి అందజేయడం జరిగినది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలను అభివృద్ధి పథంలో నడిపించటానికి వారి జీవనోపాధి గురించి కృషి చేస్తున్న సీఎంని మహిళా సంఘాలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం సుజన టిడిపి నాయకులు రావి లక్ష్మీ నర్సారెడ్డి సొసైటీ



అధ్యక్షులు బూదళ్ళ వీర రాఘవ రెడ్డి చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ దొడ్డం రెడ్డి హజరత్ రెడ్డి పువ్వాడి శ్రీనివాసులు రేవతి రమేష్ గుర్రం గోపి అమర్తులూరు ప్రభాకర్ షేక్.అబ్దుల్ రెహ్మాన్ షేక్.సుభాని శివపురం సత్య ఇళ్ళ సుబ్బయ్య మస్తాన్ షరీఫ్ టికె ఫైరోజ్ షేక్.మహమ్మద్ అలీ వెలుగు సంస్థ సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

## చేజర్ల లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



**చేజర్ల జనవరి 31 (వార్తాప్రభ)** పల్లెల్లో వాడ వాడల్లో పండుగ వాతావరణం నెలకొందని మండల టీడీపీ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేజర్ల మండలం ఆత్మకూరు నియోజకవర్గం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు సలహాలు తో మండల కేంద్రమైన చేజర్ల సచివాలయ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావి లక్ష్మీ నర్సారెడ్డి చేజర్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సోమవరపు హజరత్తయ్య సొసైటీ అధ్యక్షులు బూదళ్ళ వీర రాఘవ రెడ్డి చేజర్ల మండల ఆర్యవైశ్య అధ్యక్షులు పువ్వాడి శ్రీనివాసులు మండల ఐ టీడీపీ కార్యదర్శి మస్తాన్ షరీఫ్ బీసీ నాయకులు ఇళ్ల సుబ్బయ్య మైనార్టీ నాయకులు షేక్.సుభాని షేక్.దావూద్ షేక్.మస్తాన్ వలి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్ల తనిఖీ రిపోర్ట్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.



**మచిలీపట్నం జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ మీటింగ్ శనివారం కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్తగా రిజిస్ట్రేషన్ కొరకు ఒక స్కాన్ సెంటర్, మార్పులు చేర్పులు కోరుతూ ఐదు స్కాన్ సెంటర్లు, పునరుద్ధరణ కై మూడు స్కాన్ సెంటర్లు దరఖాస్తు చేసుకోగా , దరఖాస్తులు, ఇన్స్పెక్షన్ రిపోర్టులు పరిశీలించిన కలెక్టర్ వాటన్నింటికీ అనుమతి మంజూరు చేశారు.. ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి పి. యుగంధర్, అదనపు జిల్లా జడ్జి బి. బాబు నాయక్ , అదనపు ఎస్పీ వి.వి నాయుడు, ఎన్జీవో మెంబర్ ధర్మ తేజ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ పట్టుదలతో మంచి మార్కులు సాధించాలి

**-జిల్లా కలెక్టరు డీకే బాలాజీ**

**మచిలీపట్నం జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పదవ తరగతి విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, శ్రద్ధతో చదువుకొని పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు ఉద్బోధించారు. శనివారం సాయంత్రం నగరంలోని పోలీస్ కళ్యాణమండపంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాల ఆధ్వర్యంలో మచిలీపట్నం నగరంలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించారు. అంతకు మునుపు జిల్లా కలెక్టర్ యధావిధిగా సైకిల్ పై కలెక్టర్ కార్యాలయం నుండి బయలుదేరి పోలీసు కళ్యాణ మండపానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, శ్రద్ధతో పదవ తరగతి పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. తన చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ తాను 9వ తరగతి వరకు చదివిన తీరు, ఆ తదుపరి పదవ తరగతి నుండి చదివిన తీరు వేరని అన్నారు. పదవ తరగతిలో చాలా పోటీ వాతావరణం ఉండేదని, తాను పదవ తరగతిలో చదివిన చదివే జీవితంలో ఎంతో ఉపయోగపడిందని, ఐఏఎస్ కాగలిగాననీ విశదీకరించారు. చదువుకున్న సబ్జెక్టులను ఎప్పటికప్పుడు మననం చేసుకుంటూ ఉంటే సబ్జెక్టుపై పట్టు సాధించవచ్చన్నారు. అంతేకాకుండా పరీక్షలు వేగంగా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, మంచి కస్తూరి తో వ్రాయాలన్నారు. అప్పుడే మంచి మార్కులు పడతాయన్నారు. ప్రస్తుతం మంచి బ్రాండ్లతో వెలుగొందుతున్న సంస్థలన్నీ ఒకప్పుడు వాటి



యజమానులు అందరూ ఒకప్పుడు ఎంతో కష్టపడి పైకి వచ్చిన వారే అని అన్నారు. ముఖ్యంగా సైకిల్ బ్రాండ్ నారాయణరావు, రిలయన్స్ అధినేత ధీరుభాయ్ అంబానీ పేదరికం నుండి ఉన్నత స్థాయికి ఎదిగిన తీరు విద్యార్థులకు వివరించారు. క్రికెటర్ సచిన్ టెండూల్కర్ మొదట్లో ఎలా పట్టుదలగా ఆడేవారు ఎంతగా శ్రమించేవారు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో తెలియచెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి ఆలోచనలు గొప్పగా ఉండాలని అందుకు అనుగుణంగా ప్రణాళిక ప్రకారం అలవాట్లు మార్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి యు వి సుబ్బారావు, ప్రైవేట్ పాఠశాలల సంఘాల అధ్యక్షులు కే వి జోన్, సన్ స్టార్ పాఠశాల అధినేత శ్రీరామ్, పలు ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్ లు, యాజమాన్య సంఘాల నాయకులు, విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు కేశినేని ఫౌండేషన్ అండగా వుంటుంది.

**ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ పొందుతున్న మహిళలను కలిసి స్ఫూర్తి నింపిన కేశినేని జానకీ లక్ష్మీ**





**విజయవాడ పశ్చిమ జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మహిళల ఆర్థిక స్వతంత్రతే కుటుంబం, సమాజం ,రాష్ట్ర అభివృద్ధికి పునాది. ఎస్.హెచ్.జి మహిళలు స్వయం సమృద్ధి వైపు ధైర్యంగా అడుగులు వేయాలి. ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్.ఐ.ఆర్.డి సహకారంతో అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను వినియోగించుకుని జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలని కేశినేని ఫౌండేషన్ చైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి కేశినేని జానకి లక్ష్మీ ఆకాంక్షించారు. హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో జనవరి 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సాగుతున్న జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్ హెర్బల్ ప్రొడక్ట్స్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో శిక్షణ తీసుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా ఎస్.హెచ్.జి కి చెందిన 50 మంది మహిళలను కేశినేని జానకి లక్ష్మీ శనివారం కలిశారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో గత మూడు రోజులుగా ఎస్.హెచ్.జి మహిళలు పొందుతున్న శిక్షణ వివరాలను జానకీ లక్ష్మీ వారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్ హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ పై తాము పొందుతున్న శిక్షణ లో భాగంగా తయారు చేసిన సోప్స్ , షాంప్స్, జ్యూట్ అండ్ క్లాత్ బ్యాగ్స్ చూపించారు. అలాగే ఎస్.హెచ్.జి మహిళలు కేశినేని జానకి లక్ష్మీతో మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్ చొరవ, కేశినేని ఫౌండేషన్ సహకారంతోనే ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణ అవకాశం వచ్చిందన్నారు. తమ జీవనోపాధి మెరుగుపర్చుకునేందుకు శిక్షణ ఇప్పించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కు వారంతా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జానకి లక్ష్మీ మాట్లాడుతూ మహిళలు తల్చుకుంటే ఏమైనా సాధించగలరని, ముఖ్యంగా పొదుపు చేయటం తెలిసిన ఎస్.హెచ్.జి మహిళలు మరింత శక్తివంతులన్నారు. పొదుపు చేయటంలో విజయం సాధించిన మహిళలు, స్వయం ఉపాధి రంగంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఎస్.హెచ్.జి అంటే కేవలం సేవింగ్స్ మాత్రమే కాదు...స్వయం సమృద్ధి వైపు అడుగులు వేయటమన్నారు. కేశినేని ఫౌండేషన్ ఎప్పటికప్పుడు మహిళల నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ నిలబెట్టే సంస్థగా కొనసాగుతుంటోపాటు, ఎల్లప్పుడూ అండగా, తోడుగా ఉంటుందన్నారు. ఎన్.ఐ.ఆర్.డి శిక్షణ పొందిన మహిళలకు మండలాలకు వచ్చి కలుస్తానని...ఇక్కడ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను గ్రామాల్లోని ఇతర మహిళలకు నేర్పించి అందరూ కలిసి ఒక ప్రొడక్ట్ యూనిట్ నెలకొల్పాలన్నారు. యూనిట్ లో తయారు చేసే వస్తువులకు మార్కెటింగ్ సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమైన కుటుంబానికి ఒక పారిశ్రామిక వుండాలన్న నినాదం స్ఫూర్తితో ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నారని తెలిపారు. అందుకే తన సొంత నిధులతో ఎంపీ కేశినేని శివనాథ్ గ్రామాల పరిపూర్ణ వికాసం కోసం, మహిళల సాధికారత, స్వావలంబన సాధించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి ..ఆ దిశగా ఎన్.ఐ.ఆర్.డి, ఎన్టీఆర్ జిల్లా అధికారుల సహకారంతో ఒక ప్రణాళికగా ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్.ఐ.ఆర్.డి సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్ ఖాన్, ప్రొఫసర్ డాక్టర్ కతిరేషన్, ట్రైనర్స్ ఝాన్సీ లక్ష్మీ బాయి , డాక్టర్ జి. అంబిక లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు దేవుని వాడుకోవద్దు - వైసీపీ పార్టీ ఇన్‌చార్జి పేర్ని కిట్టు.



**మచిలీపట్నం జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో నెయ్యిలో జంతు కొవ్వు లేదని సీబీఐ ఛార్జ్‌షీట్‌లో స్పష్టంగా తేలిన నేపథ్యంలో, కూటమి ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా మచిలీపట్నం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో శనివారం బచ్చుపేట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.

రామానాయుడు పేటలోని వైసీపీ పార్టీ కార్యాలయం నుంచి బచ్చుపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పేర్ని కిట్టు, కూటమి నాయకుల విమర్శలపై తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం దేవుని పేరును వాడుకోవడం తగదని ఆయన హితవు పలికారు. సీబీఐ ఛార్జ్‌షీట్ స్పష్టంగా నిజాలను వెల్లడించినప్పటికీ, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ చైర్‌పర్సన్ చిటికెన వెంకటేశ్వరమ్మతో పాటు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెనుగంచిప్రోలు ఇలవేల్పు శ్రీ తిరుపతమ్మ



**పెనుగంచిప్రోలు, జనవరి 31( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు ఇలవేల్పు తిరుపతమ్మ. సరిగా రెండు శతబ్దాల క్రితం సాధారణంగా మొదలైన తిరుపతమ్మ గొప్పయ్య స్వామి ల కళ్యాణ దీక్షలు గ్రామ దేవతకు పెద్ద ఎత్తున ఉత్సవం జిల్లా లోనే ప్రథమం భర్త మృతి చెందాడనే వార్త వియెగాగ్ని కీ ప్రవేశం చేసిన తిరుపతాంబ అక్కడే మంగళసుత్రాలు పసుపు కుంకుమల వెలసి పెనుగంచిప్రోలు ఇలవేల్పుగా మారింది. అమ్మ వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరపుకోవడానికి ఎందరిదో విశేష కృషివుంది,కళ్యాణం ఇలా మొద లైనది. భద్రాచలం లో సీతారామ కళ్యాణం చేస్తున్న తరహాలో ఉత్సవ విగ్రహాల ను బయటకు తీసి వేదిక పై కళ్యాణం చేయాలని 1994 లో అప్పటి ధర్మ కర్తల మండలి చైర్మన్ బండి శ్రీనివాసరరావు అలాగే ప్రస్తుత అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బేనర్జీ, రామదుగుల నరసింహ చార్యులు అలోచించిన్నారు. అప్పుడు దేవస్థానం కు ఆదాయం తక్కువ ఉండటంతో అధికారులు ముందుకు రాలేదు, అయినా అప్పటి పాత దేవాలయం ముందు చిన్న వేదికను ఏర్పాటు చేశారు. తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఇంటి పేరు కొల్లా, కాకాని, వంశీ యు ల దంపతులను ఆహ్వానిం చి, పిట్టలపై కూర్చో బెట్టారు. ఇలా మొద లైన కళ్యాణం ఆదాయం పెరిగి ప్రస్తుతం ఆలయం వద్ద సుమారు లక్ష మంది ప్రత్యేకం గా విక్షి స్తూన్నారు.లి అమ్మ దీక్షలు : అయ్యప్ప స్వామి దిక్షల తరహాలో తిరుపతమ్మ మండల దీక్షలు చెప్పట్టాలని అప్పటి పెద్దలు మర్రే బోయిన రామాదాసు, అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బేనర్జీ, రామదుగుల నరసింహ చార్యులు నిర్ణయించారు, దీక్షలకు గ్రామం లో 30 మందిని ఎంపికచేశారు. వారంతా వరుసగా మూడు సంవత్సరాలు దీక్షలు కొనసాగించేలా వారిని ప్రమాణం చేయించారు..మార్రెబోయిన. రామాదాసు మొదటిగా దీక్ష తీసుకుని ఆయన గురుస్వామి గా మారి అందరికి మాలలు వేశారు. అలా మొదలైన దీక్షలు ప్రసిద్ధి చెందాయి. గుంటూరు, ప్రకాశం. కృష్ణ.( ఉమ్మడి) ఖమ్మం. నల్లగొండ, జిల్లాలల్లో అమ్మ వారికి ప్రత్యేకంగా దేవాలయాలు వెలిచ్చాయి. అక్కడి భక్తులు అక్కడే దీక్షలు తీసుకుంటున్నారు. అమ్మ వారి కళ్యాణం రోజే తిరుముడి సమర్పించుతున్నారు. ఇపుడు 30 వేల మంది దీక్ష స్వాములు దీక్ష పూని తిరుపతమ్మ అమ్మ వారి సేవలో తరిస్తున్నారు..

## ఘనతంత్ర దినోత్సవం సందర్భంగా 100 కుటుంబాలకు ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీ.



**ఎల్బీనగర్/ వార్తప్రభ( జనవరి 31)**:భారత దేశ 77వ ఘనతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చైతన్యపురి డివిజన్ పరిధిలోని వినాయక నగర్ -- న్యూ మారుతీ నగర్ వార్డులో గల శ్రీ శ్రీ శ్రీ బంగారు గవ్వల రేణుక ఎల్లమ్మ దేవస్థానం ప్రాంగణంలో 100 కుటుంబాలకు ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో షెపర్డ్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డాక్టర్ రోయ్యూరి సురేష్ సహకారంతో, దేవస్థానం చైర్మన్ కట్ట వెంకటేష్ , స్వచ్ భారత్ జిల్లా సెక్రటరీ లయన్ డాక్టర్ బి. విజయ్ రంగ , వే టూ న్యూస్ ఎల్.బి. నగర్ ఇంచార్జి వి.బి.రుషీ లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు తిరుమల రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. విజయ్ రంగ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు, ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారులు జిల్లా కలెక్టర్ కు జ్ఞాపికను అందజేశారు.

# నేటి నుండి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల

- వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడడమే తమ ప్రధాన లక్ష్యం....
- కార్యనిర్వాహణాధికారి.బి.మహేశ్వర్ రెడ్డి..
- ఆలయ పాలక మండలి చైర్మన్ చుంచు రమేష్ బాబు..

**పెనుగంచిప్రోలు, జనవరి 31( వార్త ప్రభ)** నేటి ఆదివారం నుండి ప్రారంభమయ్యే పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఆలయ పరిసరాలన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ప్రధానంగా అమ్మవారి కళ్యాణం నిర్వహించే ప్రాంగణం ముందు ఏర్పాటుచేసిన స్వాగత ద్వారాలు అలాగే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు అలంకరణ ఈ తిరుణాల్లో ప్రత్యేకంగా నిలవనున్నాయి. అంతేకాకుండా సుమారు 9 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న కళ్యాణ మండపం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఒకటో తేదీ ఆదివారం రాత్రి నిర్వహించబోయే అమ్మవారి కళ్యాణాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు సుమారు 60 వేల కు పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి కావలసిన ఏర్పాట్లను అధికారులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని



అధికారులు, పాలకమండలి చైర్మన్ చుంచు రమేష్ బాబు తెలిపారు.

# చంద్రబాబు జీవితమే నకిలీ

- దేవుడిని సైతం అపవిత్రం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది
- కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి జోగి రమేష్ ఫైర్





**ఇబ్రహీంపట్నం, జనవరి 31(వార్తా ప్రభ ప్రతినిధి):** చంద్రబాబు జీవితమే నకిలీ అని, ఆయన ప్రస్తుతం ఉన్న టిడిపి, సైకిల్ గుర్తు కూడా నకిలీ దే అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ జోగి రమేష్. ఇబ్రహీంపట్నం దాస్ ఆంజనేయ స్వామి గుడిలో శనివారం తిరుమల గట్టు కల్తీ జరిగిందంటూ కూటమి నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలను నిరసిస్తూ దాసాంజనేయ స్వామి గుడిలో పూజలు చేశారు జోగి రమేష్. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలకు బుద్ధి ప్రసాదించాలని పూజలు చేశామని తెలిపారు. తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డుపై కూటమి ప్రభుత్వం విష ప్రచారానికి దేవుడు సమాధానం ఇచ్చాడని అన్నారు. సిట్ నివేదిక లడ్డులో కల్తీ లేదని కోర్టుకు నివేదిక ఇచ్చిన ప్రభుత్వానికి బుద్ధి రాలేదని ,చంద్రబాబు బతికే నకిలీ... ఆయన ఉన్న ప్రస్తుత టిడిపి నకిలీ, సైకిల్ గుర్తు నకిలీ అని తెలిపారు. చంద్రబాబు లోకేషన్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని కొబ్బరికాయలు కొట్టినట్టు తెలిపారు. తన పైన నకిలీ ఆరోపణలు చేసి... ప్రమాణానికి రమ్మంటే పారిపోయారని,తాను దేనికైనా సిద్ధమన్న, అక్రమంగా 83 రోజులు జైల్లో పెట్టారు... భయపడే రకం జోగి కాదని అన్నారు. వరదల పెట్టుబడి వస్తున్నాయంటూ దేశాలు తిరిగి ఏం ఉద్ధరించారని ప్రశ్నించారు. ఇక్కడ ఆరోగ్యశ్రీ నిధులు కేటాయించలేక చతుకుల బడ్డారు... ప్రజలు అల్లాడిపోతున్నారని విమర్శించారు. సంక్రాంతి పండుగ జరుపుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యేలు వన్ టైం ఎమ్మెల్యేలమే అని గుర్తించారు... దాచుకో దోచుకో అనే నినాదంతో పని చేస్తున్నారని, కూటమి ఎమ్మెల్యేల కామ క్రీడలు, మహిళల పట్ల నిచంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ 2029లో తమ అధినేత జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల ప్రతిబింబంగా వార్తా ప్రభ - బిఎస్స్టార్

**వార్తా ప్రభ క్యాలెండర్ ఆవిష్కరణ.**



**మండవల్లి జనవరి 31 (వార్తా ప్రభ)** ప్రజా సమస్యలకు గొంతుకగా నిలుస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్న వార్తా ప్రభ దినపత్రిక సేవలు అభినందనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు (బిఎస్స్టార్) అన్నారు.మండవల్లి మండలంలో శుక్రవారం వార్తా ప్రభ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో వార్తా ప్రభ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.గ్రామీణ ప్రాంతాల సమస్యలు, పేదలు--నిరుపేదల గళం, రైతుల కష్టాలు, యువత ఆకాంక్షలు, ప్రజా ప్రతినిధుల బాధ్యతలను నిరంతరం వెలుగులోకి తీసుకొస్తూ వార్తా ప్రభ నియోజకవర్గ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోందని బిఎస్స్టార్ ప్రశంసించారు. అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించే ధైర్యం, ప్రజాపక్షపాత ధోరణితో వార్తలు ప్రచురించడం వలన ప్రజల్లో చైతన్యం పెరుగుతోందన్నారు.నేటి కాలంలో నిజమైన జర్నలిజం అరుదుగా మారుతోందని, అలాంటి పరిస్థితుల్లో వాస్తవాలకు కట్టుబడి, ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న వార్తా ప్రభ వంటి పత్రికలు సమాజానికి ఎంతో అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని, ఆ బాధ్యతను వార్తా ప్రభ సమర్థవంతంగా నిర్వహిస్తోందని కొనియాడారు.భవిష్యత్తులో కూడా నియోజకవర్గ అభివృద్ధి, సామాజిక న్యాయం, బీసీ వర్గాల సమస్యలు, ప్రజా సంక్షేమ అంశాలపై వార్తా ప్రభ మరింత బలంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వార్తా మండలి రిపోర్టర్ రామకృష్ణ, ఏలూరు టైమ్స్ రిపోర్టర్ స్టాలిన్, వార్తా ప్రభ ప్రతినిధి అబ్రహం, బసవయ్య, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# వన ప్రవేశంతో ముగిసిన గోదావరిఖని జాతర!!

**అధికారుల సమన్వయంతో గ్రాండ్ సక్సెస్**
**కనుల పండువగా సమ్మక్క-సారలమ్మల వన ప్రవేశం**
**విజయవంతంలో హైలెట్‌గా నిలిచిన పోలీస్ శాఖ**
**ఎమ్మెల్యే కృషికి జన, భక్త నీరాజనం**

పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 31 (వార్తాప్రభ





ప్రతినిధి)గోదావరిఖని గడ్డపై గత నాలుగు రోజులుగా అత్యంత వైభవంగా జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతర శనివారం రాత్రి వన ప్రవేశంతో ఘనంగా ముగిసింది. లక్షలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య, 'జనం' నుండి మొక్కులందుకున్న వనదేవతలు తిరిగి 'వనం' చేరుకోవడంతో ఈ ఆధ్యాత్మిక ఘట్టం సంపూర్ణమైంది. ఈ ఏడాది జాతర అపూర్వ జనసందోహంతో గ్రాండ్ సక్సెస్‌గా నిలవడానికి అన్ని ప్రభుత్వ శాఖల మధ్య నెలకొన్న అద్భుతమైన సమన్వయమే ప్రధాన కారణం. ముఖ్యంగా భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా, గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా అధికారులు చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయం. ఈ మొత్తం ఉత్సవంలో పోలీస్ శాఖ పనితీరు అత్యంత హైలెట్‌గా నిలిచింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ నుంచి శాంతిభద్రతల పర్యవేక్షణ వరకు సాంకేతికతను జోడించి వారు అందించిన సేవలు జాతర విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించాయి. ఎండను సైతం లెక్కచేయకుండా లక్షలాది మందికి రక్షణగా నిలిచిన ఖాకీల అంకితభావం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. తాగునీరు, పారిశుధ్యం అలాగే వైద్య సదుపాయాల్లో ఎక్కడా లోటు లేకుండా యంత్రాంగం నిరంతరం శ్రమించడంతో భక్తులు సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. గోదావరిఖని గోదావరి నది తీరాన ఆధ్యాత్మిక వెల్లువను నింపిన స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఈ జాతర, ప్రభుత్వ విభాగాల సమష్టి కృషికి నిలువుటద్దంగా నిలిచి చరిత్రలో మరో అద్భుత అధ్యాయాన్ని లిఖించింది.

## అంబటి పై మంగళగిరి పోలీసులకు ఫిర్యాదు. ...

**అంబటి పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి.....**
**టిడిపి నేతలు పాతర్లరమేష్, తోపూరి గంగాధర్లు...**

**అమరావతి జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అంబటి పతనం



నేటితో ప్రారంభమైందని ధరిద్రుడు, కామాంధుడైన అంబటి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్, తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయ సమాచార హక్కు విభాగం అధిపతి తోపూరి గంగాధర్ లు తీవ్రంగా ఖండించారు చంద్రబాబుపై అంబటి రాంబాబు ఇచ్చిన వ్యాఖ్యలు పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని శనివారం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అంబటి పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వారు మంగళగిరి ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ కు ఫిర్యాదు చేశారు, తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తప్పు ద్రోవ పట్టించేందుకు వైసీపీ నేతలు ఆడుతున్న డ్రామా అని వారు విమర్శించారు అంబటి వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని పాతర్ల రమేష్ అన్నారు అంబటి అహంకారం తో చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని తోపూరి గంగాధర్ అన్నారు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుపై అంబటి రాంబాబు బుద్ధి లేకుండా నీచంగా మాట్లాడారని వారు విమర్శించారు

# వేసవి రాకముందే మేల్కొందాం!!

● సామాజిక బాధ్యతగా వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలి ● నరసింహుని భక్తులకు జల ప్రసాదం కోసం డిమాండ్ ● సింగరేణికి సుందిల్ల నేతల కీలక విజ్ఞప్తి

**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 31 (వార్తాప్రభ ప్రతినిధి)**సుందిల్ల గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ కు డిమాండ్ పత్రం అందజేశారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, అటు ఆలయానికి వచ్చే భక్తులకు, ఇటు గ్రామ ప్రజలకు ఎటువంటి తాగునీటి ఎద్దడి కలగకుండా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్‌ను నిర్మించాలని వారు కోరారు. ముఖ్యంగా గుడికి వచ్చే భక్తులకు ఉచితంగా జల ప్రసాదం అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సుందిల్ల గ్రామ పాలక వర్గ సభ్యులు ఎరుకల చంద్రయ్య, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బోగిరి తిరుపతి సింగరేణి యాజమాన్యాన్ని విన్నవించారు. సామాజిక బాధ్యతగా సింగరేణి సంస్థ ఈ నీటి ప్లాంట్ ఏర్పాటుకు సహకరించాలని, దీనివల్ల వేసవిలో ప్రజల దాహార్తి తీరుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాసరి



దినేష్, జనగామ ప్రభాకర్, యువ నాయకులు కనుకుల సతీశ్, బోగిరి దివాకర్ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఈ ప్రాజెక్టును త్వరగా చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సైబర్ నేరాలపై సరైన అవగాహన ముఖ్యం

**- సాంకేతికత వినియోగం, భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలి - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**విజయవాడ పశ్చిమ జనవరి 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రస్తుత సాంకేతిక యుగంలో టెక్నాలజీ మన జీవితాలను సులభతరం చేస్తున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికతను వినియోగించే ప్రతిఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, సైబర్ భద్రత విషయంలో రాజీపడొద్దని స్పష్టం చేశారు.శనివారం కేబీఎన్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం, నక్ష్ ఫౌండేషన్ (ప్రాజెక్ట్ సైబర్ షీల్డ్ ఇనీషియేటివ్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మనం చేసే ప్రతి ఆన్‌లైన్ చర్యపై పూర్తి అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. చిన్న పొరపాటు కూడా సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పించి, మన కష్టార్జితాన్ని కోల్పోయే పరిస్థితికి దారితీయవచ్చని హెచ్చరించారు. ప్రత్యేకంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు, ఈ-కామర్స్ కొనుగోళ్లు, సోషల్ మీడియా వినియోగం విషయంలో అప్రమత్తత చాలా అవసరమని తెలిపారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, ఈమెయిల్స్‌కు స్పందించకుండా ఉండాలని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయరాదని సూచించారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని స్పష్టం చేశారు. ఈ వయసు ఆ వయసు అనే తేడా లేకుండా ఏ వయసు వారైనా తప్పనిసరిగా సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు సాంకేతికతను సమర్థంగా ఉపయోగించడమే కాకుండా, దాని భద్రతా అంశాలపై కూడా పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. సైబర్ నేరాల నివారణలో అవగాహనే ప్రధాన ఆయుధమని, ఇలాంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీసీపీ కృష్ణ ప్రసన్న తెలిపారు.కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏవో వి.నారాయణరావు, డీసీపీ కృష్ణ ప్రసన్న, నక్ష్ ఫౌండేషన్ ఫౌండర్ రిషబ్ సింగ్, కో ఫౌండర్ రాషి భాటియా, ప్రాజెక్ట్ సైబర్ షీల్డ్ సౌత్ జోనల్ కోఆర్డినేటర్ యశశ్విని, ధారా కరుణశ్రీ విద్యార్థులు హాజరయ్యారు. సైబర్ నేరాల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలన్న అంశాలపై విద్యార్థులు స్పష్టత పొందారు.

# విద్యార్థి దశలో ప్రతి అడుగు మైలురాయిగా భావించాలి

● విద్యార్థులు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి ● 40 సంవత్సరాల సుదీర్ఘ విద్యావ్యవస్థ అభినందనీయం ● డాన్ బోస్కో స్కూల్ వార్షికోత్సవ వేడుకలలో ఎ జిల్లా కలెక్టర్ జి లక్ష్మి శా





**ఇబ్రహీంపట్నం, జనవరి 31(వార్తా ప్రభ ప్రతినిధి):**చదువుకునే రోజుల్లో విద్యార్థికి ప్రతి అడుగు ఒక మైలురాయిగా భావించాలని తెలిపారు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మి శా. శుక్రవారం గుంటుపల్లి డాన్ బోస్కో స్కూల్ (స్టేట్ )రూబీ జూబ్లీ వార్షికోత్సవంలో అయన ముఖ్య అతిధి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ జీవితం తిరిగి రాదని, దాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. తప్పు మార్గంలో వెళ్లిన వారు వాటిని తెలుసుకొని సన్మార్గంలో నడవాలని కోరారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణలో మెలగాలని కోరారు. మంచిగా చదివి స్కూల్ తో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. టెక్నాలజీతో ఎంత ఉపయోగం ఉందో అంత చెడు కూడా ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిదాన్ని నమ్మవద్దని, ఒకటికీ రెండు సార్లు పరిశీలన చేసుకోవాలని కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధికీ కృషి చేస్తున్న డాన్ బోస్కో యాజ మాన్యంను కలెక్టర్ అభినందించారు. స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఎంఈఓ పుష్పలత మాట్లాడుతూ పిల్లల్లో స్ఫూర్తి నింపేలా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులను కోరారు.ఈ కార్యక్రమంలో డాన్ బోస్కో ప్రావిజినల్ పాదర్ శాంటియాగు థోమస్,డాన్ బోస్కో కరస్పాండెంట్ పాదర్ జార్జ్, డాన్ బోస్కో స్కూల్స్ ప్రిన్సిపల్స్ పాదర్ విజయ్ ప్రకాష్, పాదర్ సందీప్ , డాన్ బోస్కో స్కూల్ ఇంచార్జ్ వేలంగిణి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకిది కీలక సమయం అలసత్వం వద్దు

**ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కండి.. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**



**ఇబ్రహీంపట్నం,జనవరి 31(వార్తా ప్రభ ప్రతినిధి):** పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులకు అత్యంత కీలకమైన సమయమని ధైర్యంగా పరీక్షలను ఎదురుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు.మార్చి 16వ తేదిన 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం జిల్లా. కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ను సందర్శించి విద్యార్థుల విద్యా భోదనను పరిశీలించారు.ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ ముచ్చటిస్తూ విద్యార్థుల మేధా శక్తిని పరిశీలించారు. పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుండి సమాదానాలను రాబట్టారు. గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ కు సంబంధించి విద్యార్థులు ఇచ్చిన సమాదానాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలన్నారు. సబ్జెక్టు ఉపాధ్యా యులు ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి వారికి అర్థమయ్యే రీతిలో బోధించి పరీక్షలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే పద్ధతి, ప్రశ్నకు సంబంధించి జవాబు వ్రాసే విధానం వంటి విషయాలను విద్యార్థులకు సూచించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమ ఉపాధ్యా యులుగా విద్యార్థుల తల్లిదండ్రులలో గౌరవం పొంది పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన వారవుతారన్నారు. 10వ తరగతి ఫలితాలలో జిల్లాను అగ్రగామిగ నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఉపాధ్యాయులకు సూచించారు.పాఠశాల సందర్శనలో జిల్లా కలెక్టర్ వెంట డిఇవో ఎల్. చంద్రకళ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సంధ్యారాణి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బంగారు చేతుల్లో బంగారం!!

● ముద్దులొలికే ముఖంతో మొక్కులు
● వనదేవతల చెంతన చిన్నారి భక్తి
● ఆకట్టుకున్న అపురూప దృశ్యం
● సమ్మక్క సారలమ్మ జాతరలో మురిసిపోయిన భక్తజనం



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 31 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతరలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంటే, అక్కడ కనిపించిన ఒక దృశ్యం భక్తుల మనసులను గెలుచుకుంది. లక్షలాది మంది భక్తిప్రపత్తులతో తరలివచ్చే ఈ వనదేవతల చెంతకు, ఒక బుజ్జి పాప తన చిట్టి చేతులతో బంగారాన్ని (బెల్లం) పట్టుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించడానికి రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పసి ప్రాయంలోనే భక్తిని నింపుకున్న ఆ చిన్నారి, తన బంగారు చేతులతో అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పిస్తుంటే చూసేవారికి రెండు కళ్లు చాలలేదు. సమ్మక్క, సారలమ్మల ఆశీస్సులు ఆ పసిపాపపై ఎల్లప్పుడూ ఉండాలని అక్కడ ఉన్న భక్తులు మురిసిపోయారు. పట్టువస్త్రాలు ధరించి, ఎంతో నిష్ఠతో ఆ చిన్నారి అమ్మవారి గద్దెల ముందు నిలబడటం జాతరలోని కోలాహలాన్ని మరింత పెంచింది. తల్లిదండ్రుల ఒడిలో ఉండి గద్దెలను తాకుతూ ఆ బుజ్జి పాప చేసిన ప్రార్థన, జాతరలో భక్తికి వయసుతో సంబంధం లేదని నిరూపించింది. అడవి తల్లుల ఆశీర్వాదం కోసం వచ్చిన వేలాది మంది భక్తుల మధ్య, ఈ చిట్టి తల్లి అందరి దృష్టిని ఆకర్షించి జాతరకే ఒక నిండుదనాన్ని తెచ్చింది. అమ్మవారికి సమర్పించిన ఆ బంగారం కంటే, ఆ పాప చూపిన నిష్కల్మషమైన భక్తే మిన్నగా అనిపించింది. గోదావరిఖని గడ్డపై ఈ అపురూప దృశ్యం భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# అవినీతి జోగి.. ఆపు నీ అరాచకం డ్రామాలు

**నీ రోత మాటలతో ఆలయం అపవిత్రమైంది**
**దాసాంజనేయ స్వామి గుడి మెట్లు శుభ్రం చేసిన టీడీపీ నేతలు**





**ఇబ్రహీంపట్నం, జనవరి 31 (వార్తా ప్రభ ప్రతినిధి):** అరాచక జోగి డ్రామాలు ఆపాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కొండపల్లి మున్సిపల్ చైర్మన్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని దాసాంజనేయ స్వామి దేవాలయాన్ని టీడీపీ నేతలు శనివారం పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోగి రోత మాటలతో ఆలయం అపవిత్రమైందని మండిపడ్డారు. కల్తీ మద్యం కేసులో 83 రోజులు జైలు జీవితం గడిపినా జోగి బుద్ధి మారలేదన్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిందని, అలాగే మాజీ మంత్రి జోగి అవినీతి, అరాచకాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. జైలు నుంచి బయటకు వచ్చిన జోగి ఇంటి వరకు అరాచకం చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబును నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తు ఊరుకునేది లేదని నాలుక కోస్తామని హెచ్చరించారు. కల్తీ మద్యం కేసులో కడిగిన ముత్యంలా జోగి బయటకు వచ్చారని చెప్పుకుంటున్నారని, దీనిపై న్యాయస్థానం నిర్ణయిస్తుందన్న విషయం గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశాన్ని అత్యున్నతంగా నిలబెట్టాలి:

**ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్**



**ఇబ్రహీంపట్నం జనవరి 31(వార్తా ప్రభ ప్రతినిధి):**మన దేశాన్ని ప్రపంచంలో అత్యున్నత స్థానంలో నిలబెట్టేందుకు గౌరవ ప్రధానమంత్రి కృషిచేస్తున్నారని.. అదేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి విజన్ ఏ 2047ను ఆవిష్కరించారని శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. అభివృద్ధికి సంబంధించి ఎక్కడ లోపం ఉందో గుర్తించి.. అక్కడ ప్రత్యేకంగా దృష్టిపెట్టి శతశాతం అభివృద్ధిని సాధించడమే ఆకాంక్షిత బ్లాకు కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ చేర్చాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. బడుగుబలహీన వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్న ఇబ్రహీంపట్నం మండలంలో విద్య, వైద్యం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. ఆరోగ్య ఆంధ్ర సాకారానికి ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరముందన్నారు. అమృత్ 2.0 ద్వారా త్వరలో తాగునీటి సమస్య తీరనుందన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖ, పశుసంవర్థక శాఖల ఆధ్వర్యంలో మొత్తం ఆరు స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిద్వారా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఇగ్నైట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. వీటిద్వారా వివిధ శాఖల పరిధిలో అందుబాటులో ఉన్న పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అందుబాటులో ఉన్న మార్గాలపై అవగాహన కల్పించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించేందుకు ఇగ్నైట్ సెల్ ఉపయోగపడుతోంది. సంపూర్ణతా అభియాన్ 2.0కు సంబంధించి థీమ్ వారీగా పోస్టర్లను, లోగోను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీఈవో ఎల్.చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, పశు సంవర్థక అధికారి డా. ఎం.హనుమంతరావు, ఎంపీడీవో డి.శకుంతల, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ









**కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను పంపిణీ చేసింది.. ఒక రోజు ముందుగానే పింఛన్ అందడంతో వారి కళ్లలో సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని హర్షం వ్యక్తం చేశారు.**

**గుడివాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** స్థానిక శాసనసభ్యులు వెనిగండ్ల రాము ఆదేశాలతో 30వ వార్డు -ధనియాల పేట నందు జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పాల్గొని పెన్షన్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందుకుంటున్న లక్షలాది మంది లబ్దిదారులకు ఒక రోజు ముందుగానే పెన్షన్ సొమ్ము అందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ॥ 50వేల కోట్లకుపైగా పెన్షన్ల పై ఖర్చు పెట్టారన్నారు. ఫిబ్రవరి నెలకు గాను 63.12 లక్షల మందికి పెన్షన్ ఇచ్చేందుకు రూ ॥ 2743 కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం ఈనెల 1వ తేదీన పెన్షన్ ఇవ్వాల్సి ఉన్నా ఒక రోజు ముందే అనగా 31వ తేదీనే మీ ఇళ్ల వద్ద పెన్షన్ పంచే ఏర్పాటు కుటుంబ ప్రభుత్వం చేసిందని తెలియజేశారు. ఇదే క్రమంలో సచివాలయం సిబ్బందితో కలిసి వార్డు కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, సెక్రటరీ నరేంద్రబాబు, రామిథేను వేణుబాబు దేవాది నాగేశ్వర రావు, పోలవరపు శ్రీను లలితకుమారి దత్తి రాంబాబు తదితరులు లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణి చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణిలో 17వ వార్డు టిడిపి ఇన్చార్జి మరీదు రోహిత్ కుమార్, కార్యదర్శి ఎం ప్రభాకర్, కూటమి సభ్యులు జనసేన నాయకుడు షేక్ మీరావలీ శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం ట్రస్టీ సభ్యులు ముప్పిడి ఉమా, మండలి శ్రీనివాస్ లు పెన్షన్లు పంపిణి చేసారు. 11వ వార్డులో టిడిపి నాయకులు సయ్యద్ జబిన్ మరియు వార్డు ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా లు పెన్షన్లు పంపిణి చేసారు. ఈ సందర్భంగా జబీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.50వేల కోట్లకు పైగా పింఛన్ల పై ఖర్చు పెట్టిందన్నారు. పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించే పింఛను పంపిణీ అత్యంత సంతృప్తిని కలిగిస్తుందని పేర్కొన్నారు. 31 మరియు 1 వార్డుల నందు టిడిపి నాయకులు శీరం రమేష్, పులి ప్రసాద్, గ్రామ సర్వేయర్ అబ్దుల్ సలాం తదితరులు.. 33వ వార్డులో జరిగిన పెన్షన్ల పంపిణిలో కూటమి సభ్యులు కోడూరు ప్రభు, మూడెడ్ల శ్రీధర్, ఎక్కల కిషోర్, మణికంఠ సిబ్బంది క్లస్టర్ ఇంచార్జులు.. 36వ వార్డు నాగవరపాడు లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు హెల్త్ సెక్రటరీ పి హేమలత ద్వారా టిడిపి జిల్లా తెలుగుదేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ మెరుగుమాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేయగా.. ఇందులో దాసరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. 2వ వార్డులో మరియు 28వ వార్డులో జరిగిన పెన్షన్ల పంపిణి లో రెడ్డి అప్పారావు, డేవిడ్ రాజు లు 29వ వార్డు పెన్షన్ల పంపిణిలో నాయకులు ఎస్ తిరుపతి రావు, పి ఉమామహేశ్వరరావు తదితరులు 22వ వార్డులో జనసేన పార్టీ నాయకులు సయ్యద్ నజీర్, కూటమి నాయకులు 31 వ వార్డులో నాయకులు బొంబాయి శ్రీనివాసరావు తదితరులు 32 వ వార్డులో వార్డు నాయకులు చందు శ్రీనివాసరావు, రంగారావు ఇతర కూటమి నాయకులతో కలిసి క్లస్టర్ ఇంచార్జ్ పంచుమర్తి శ్రీనివాసరావు లు పాల్గొన్నారు. 33 వ వార్డులో నాయకులు కోడూరి ప్రభు తదితరులు.. 18వ వార్డులో జరిగిన పెన్షన్ల పంపిణీలో ఇంఛార్జ్ అల్లాడ శ్రీనివాస్, జనసేన ఇన్ చార్జ్ జనపాల కిరణ్ కుమార్ రెడ్డి, కొత్త వెంకటేశ్వరరావు, పిల్లి నాగేశ్వరరావు, చుక్క సత్యనారాయణ మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. 22వ వార్డులో మొహమ్మద్ ఆరిఫ్ చనిపోవడంతో వారి స్థానంలో భార్య మొహమ్మద్ ఆబెదున్నేసాకి నూతన పెన్షన్ ఇవ్వడం జరిగింది. అలాగే 27వ వార్డు నందు బేతవోలు లో జరిగిన పెన్షన్ల పంపిణిలో సచివాలయం సిబ్బంది తో కలిసి శొంఠి శ్రీనివాసరావు, దివ్వెల రంగబాబు, కాగిత శంకర్ లు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు చెస్ పోటీలు



**గుడివాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** స్థానిక ఏ.ఎన్.ఆర్. కళాశాలలో కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్ ఉమెన్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న (8) కళాశాలల నుండి విచ్చేసిన విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమము ముగింపు సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఏ.ఎన్.ఆర్. కళాశాల ప్రెసిడెంట్ లింగం రామకృష్ణ ప్రసాద్ ప్రసంగిస్తూ చెస్ గేమ్ అనేది మనిషి యొక్క ఆలోచన విధానాన్ని మెరుగు పరుస్తుందని తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్ ఉమెన్ టోర్నమెంట్లో విజేతలుగా మొదటి స్థానంలో కె.బి.ఎన్ కాలేజీ, విజయవాడ ద్వితీయ స్థానంలో ఎ.జి. అండ్ ఎస్.జి. కళాశాల, ఉయ్యూరు తృతీయ స్థానంలో ఎస్.వి.డి. లా కళాశాల, కానూరు విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో కళాశాల పాలకవర్గ సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.ఎస్. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి, కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్ ఉమెన్ టోర్నమెంట్లో సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ ఎన్. హేమ వెంకట లక్ష్మి, ఎం. సాంబశివరావు మరియు పరిశీలకులుగా డా. పర్చూరి గోపి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మోటూరు దేవాలయంలలో హుండీ లెక్కింపు..

**గుడివాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** గురువారం మండల పరిధిలోని మోటూరు గ్రామం లో వేంచేసి ఉన్న.శ్రీ సీతా రామ స్వామి దేవాలయం లో హుండీలు లెక్కించగా రూ. 94,891/- రాగా.. శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవాలయం లో రూ. 20131/- వచ్చినట్లు ఆలయ ఈ.ఓ. శ్రీమతి జి. మౌనిక సదరు ఒక ప్రకటనలో తెలియచేశారు. పై కార్యక్ర మంలో గుడివాడ డివిజన్ ఇన్స్పెక్టర్ వి. సుధాకర్ పర్యవేక్షించారు.

# రాజకీయ దురుద్దేశంతోనే శ్రీవారి లడ్డూపై దుష్ప్రచారం

● కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన కూటమి నేతలు..

**గుడివాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** స్థానిక రాజేంద్రనగర్ లోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన వైసీపీ నాయకులు మాట్లాడుతూ తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ స్పష్టం చేయడంతో చంద్రబాబు దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది శ్రీవారి భక్తుల మనోభా వాలను దెబ్బతీసిన టీడీపీ కూటమి కుతంత్రం విఫలమైంద న్నారు హర్యానాలోని 'ఐసీఏఆర్- నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్', గుజరాత్ లోని 'నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు(ఎన్డీడీబీ) ఆ నెయ్యి శాంపిల్స్ను పరీక్షించి వాస్తవాన్ని నిర్ధారించాయని పంది, చేప తదితర జీవుల కొవ్వు ఆ నెయ్యిలో కలవనే లేదు..' అని తేల్చి చెప్పాయన్నారు లడ్డూపై తీవ్ర ఆరోపణలు చేసిన చంద్రబాబు.. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందంటూ కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం స్థాయిలో ఉన్న చంద్రబాబు భయంకరమైన ఆరోపణలు చేశారంటూ దుయ్యబట్టారు. కోట్లాది హిందువుల మత విశ్వాసాలపై దాడి కాదా? అంటూ నిలదీశారు.తిరుమల లడ్డూపై సీబీఐ ఇచ్చిన రిపోర్ట్.. చంద్రబాబు, పవన్ కల్యాణ్కు చెంపపెట్టులా మారిందన్నారు ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు గొర్ల శ్రీను, నేతలు పాలేటి చంటి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మెరుగుమల కాళీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు జాన్ విక్టర్, అద్దేపల్లి పురుషోత్తం, కందుల నాగరాజు, జ్యోతుల మణికంఠ, దుడ్డు చిన్న నీరుడు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



# వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శం

● బివిపి గుడివాడ శాఖ అధ్వర్యంలో ముగిసిన స్వామి వివేకానంద మాసోత్సవాలు.. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు..



**గుడివాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** గత నెల రోజులుగా భారత్ వికాస్ పరిషత్ (బివిపి) గుడివాడ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద మాస ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గుడివాడ మరియు పరిసర ప్రాంతాలలో 20 స్కూల్స్, 4 కాలేజీలలో అవగాహన సదస్సులు పెట్టి, వ్యాసరచన పోటీలను నిర్వహించింది. విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు విశ్వభారతి స్కూల్ కస్తూరి భవన్ నందు ముగింపు కార్యక్రమంలో ప్రతి స్కూల్ నుండి 4 బహుమతి ప్రధానోత్సవం చేయడం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అర్డీఓ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వామి వివేకానంద యొక్క జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని.. భారత్ వికాస్ పరిషత్ ఇలాంటి మంచి మంచి సంస్కార ప్రోగ్రామ్స్ చేస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు తిరుమలశెట్టి హారిక మాట్లాడుతూ ఇలాంటి మంచి మంచి ప్రోగ్రామ్స్ చేయడానికి అవకాశం ఇచ్చినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఏ. వెంకటేశ్వరరావు, ట్రెజరర్ ఆర్‌వి ఆర్ ప్రసాద్, కెడి ఎన్ శ్రీనివాస్, పినపాల చంద్రశేఖర్, స్వామి రామ్మోహన్ రావు పిఎల్‌వి సుబ్రమణ్యం, రూప్ చాంద్ జైన్, టంగుటూరి శ్రీనివాస్, పి. రాధాకృష్ణ, తిరుపాల్ గుప్తా, దండమూడి జయలక్ష్మి, నల్లారి శేషగిరిరావు, అర్జా ప్రసాద్, కోన రామారావు, మల్లవల్లి షణ్ముఖ నందన్, సోమ సుందరం, అంకెం సత్యవతి, విశ్వభారతి స్కూల్ మేనేజ్మెంట్ కెవి ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం పోయేవరకు ఎర్రజెండాతోనే జీవించిన వ్యక్తి గూడపాటి

## -సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని



**గుడివాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** తన తుదిశ్వాస విడిచే వరకు ఎర్రజెండా కింద్ర జీవించిన వ్యక్తి కామ్రేడ్ గూడపాటి సువిశేశ్వరరావు అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. శనివారం స్థానిక పెద ఎరుకపాడులో కామ్రేడ్ సువిశేశ్వరరావు సంతాప సభను సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంతాప సభకు ముఖ్య అతిధిగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. పిచ్చయ్యలతో కలసి అమె మాట్లాడుతూ నేను విద్యార్థి దశలో ఉన్న సమయం నుండి సువిశేశ్వరరావు బేతవోలులో ఇండ్ల స్థలాల కోసం పేదల కోసం పోరాడి జైల్ జీవితం కూడ అనుభవించిన వ్యక్తి కమ్యూనిస్టు యోధుడు కొనియాడారు. నేడు భారత దేశంలో మత ఘర్షనలు పెరిగిపోతున్నాయన్నారు. పేదల పక్షాన పోరాటం చేస్తున్న వారికి నక్సలెట్ల పేరితో చంపివేస్తు, దేశ ద్రోహులకు చిత్రికరిస్తున్నరని, సింగమ్మ పోరాటం చేసింది అస్తి కోసమా, మేడలు మిద్దేలు కోసం గిరిజనుల సంక్షేమ కోసం పోరాటం చేయడం జరిగిందన్నారు. ధర్మస్థలలో బిజెపి ఎంపి చేస్తున్న అరాచకలను తన పత్రిక ద్వార వెలుగులోకి తీసుకోచ్చినందుకు గౌరిలంకేశ్వరిని చంపి వేయడం జరిగిందన్నారు. డా॥ బాబా సాహేబ్ బి.ఆర్ అంబేద్కరను ఒక పక్క పొగుడుతు, మరో పక్క అయన రాచిన రాజాంగాన్నికి తూట్లు పొడుసు రదు చేయాలని మతోనమద శకిలు పనిచేసున్న సమయంలో గూడపాటి లాంటి వ్యక్తులు పార్టీ మనగడ కోసం చివరికంట కమ్యూనిస్టుగా జివించిన వ్యక్తి సువిశేశ్వరరావు అన్నారు. ఈ సభలో జిల్లా కార్యవర్గ సభ్యులు మొదుమూడి రామరావు, ఏఐటియుసి జిల్లా కన్వీనర్ లింగం ఫిలిప్, గన్నవరం సిపిఐ కార్యదర్శి కాంట్రగడ్డ రామచంద్రజోషి, రైతు సంఘం జిల్లా నాయకులు వెలగపూడి ఆజాద్, సిపిఎం డివిజన్ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి బడుగు చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాదిక్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, వైసిపి నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, జనసేన నాయకులు సందు పవన్, బిజెపి నాయకులు అంగడాల సతీష్, వల్లపర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వేగనియంత్రణతో ప్రమాదాలు నివారించవచ్చు:జిల్లా ఎస్పీ బిందు మాధవ్

● రక్తదానం చేసిన ఎస్పీ





**కాకినాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** వేగం నియంత్రణ తో ప్రమాదాలు అరికట్ట వచ్చునని ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. కాకినాడ జిల్లా పోలీసు శాఖ,కాకినాడ రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా కాకినాడ పోర్టు పోలీసు స్టేషన్ పరిధిలోని లారీ యూనియన్ కార్యాలయంలో వైద్య శిబిరం,రక్తదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎస్పీ వాహనదారులకు రహదారి భద్రత పై పలు సూచనలు చేశారు. డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ -- ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ వేగాన్ని నియంత్రించుకోవడం ద్వారా ప్రమాదాలకు గురికాకుండా, తమ వల్ల ఇతరులకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడాలని లారీ డ్రైవర్లకు సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగించడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వలన వాహనాన్ని అదుపు చేయడం కష్టమవుతుందని, ఆక్సిడెంట్స్ జరగటానికి అవకాశం ఉందని హెచ్చరించారు. ఇటీవల కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని ప్రమాదాన్ని ఉదాహరణగా పేర్కొంటూ, వాహనంలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడం ఎంత ప్రమాదకరమో వివరించారు. "వేగం కన్నా ప్రాణం మిన్న" అనే విషయాన్ని ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాలని సూచించారు. అవగాహన కార్యక్రమాలు ఎన్నో నిర్వహించినప్పటికీ ప్రజల్లో తగిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వీయ నియంత్రణ, రోడ్డు నియమాలపై అవగాహన, రహదారి భద్రత నియమాలు అవలంబించటం వలన ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన,వ్యాస రచన,క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎస్పీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మరియు డీటీసీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా కాకినాడ జిల్లా పోలీసు రవాణా శాఖ ఆధ్వర్యంలో, కాకినాడ జీజీహెచ్ ,రోటరీ క్లబ్ సహకారంతో లారీ యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను రక్తదాన శిబిరంను ఎస్పీ జి . బిందు మాధవ్ ప్రారంభించి స్వయంగా రక్తదానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో కాకినాడ ఉప రవాణా కమిషనర్ కె. శ్రీధర్, ఆర్టీవో బి.వి. మురళీకృష్ణ,మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.హరినాథ్ రెడ్డి, డి. శ్రీకాంత్ బాబు, బి. లక్ష్మీకిరణ్ తదితరులు కూడా రక్తదానం చేశారు.పలువురు డ్రైవర్లు,సామాజిక కార్యకర్తలు, ప్రజలు కూడా రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డీటీసీ కె. శ్రీధర్, ఆర్టీవో బి.వి. మురళీ కృష్ణ, ఎస్‌బీ డీఎస్పీ కెవివి. సత్యనారాయణ, ఇతర పోలీసు ,రవాణా శాఖ అధికారులు,రోటరీ క్లబ్ ప్రతినిధులు,జీజీహెచ్ ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, లారీ యూనియన్ సభ్యులు,విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ నూతన కార్యవర్గం




**విజయవాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** ఏఐసీసీ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో 2026 సంవత్సరానికి విజయవాడ నగర ఏఐసీసీ నూతన కమిటీకి అధికారికంగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భం గా జాతీయ అధ్యక్షులు రెవ. డా.గెర హనోక్,అంతర్జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు గా రెవ. డా. సామెల్ కృపాకర్ నూతనంగా నియమి తులైన కమిటీ సభ్యులకు న పత్రాలు అందజేశారు. విజయవాడ నగర ఏఐసీసీ -- 2026 నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు గా పాస్టర్ బెన్హామ,పాస్టర్ జోనా, పాస్టర్ జాన్ వెస్లీ, ప్రెసిడెంట్ గా బ్రదర్ మద్దిరాల కమలాకరరావు , వైస్ ప్రెసిడెంట్లు గా పాస్టర్ డేనియల్ బాబు, పాస్టర్ సతీష్, ఏపీ స్టేట్ కార్యదర్శి గా పాస్టర్ డానియల్ బోస్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ నెహెమియా సహాయ కార్యదర్శి గా పాస్టర్ ధర్మనాయక్, సెక్రటరీలు పాస్టర్ ఎజ్రా, పాస్టర్ గ్రేస్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గా పాస్టర్ ఆనంద్ బెన్హామ్, ట్రెజరర్ పాస్టర్ తిమోతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ గా పాస్టర్ అజయ్ , పాస్టర్ అబ్రహం , పాస్టర్ లాజర్, చీఫ్ అడ్వైజర్ గా పాస్టర్ ప్రభుదాస్, విజయవాడ రూరల్ అధ్యక్షులు గా పాస్టర్ జాన్ వెస్లీ, విజయవాడ సిటీ ఢ రూరల్ యూత్ అధ్యక్షులు పాస్టర్ హెలి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మాట్లాడిన నాయకులు, ఏఐసీసీ సంస్థ ప్రభువు మహిమకోసం, క్రైస్తవ సమాజ ఐక్యత, శాంతి మరియు సేవాభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు అందరూ వినయంతో, బాధ్యతతో, విశ్వాసపూర్వకంగా సేవ చేయాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, సంఘ నాయకులు మరియు ఏఐసీసీ సభ్యులు పాల్గొన్నారు.

# భారతదేశ నాగరికతను నిర్మించింది బీసీలే - బి.సి.నాయకులు కనుమూరి ఆంజనేయ ప్రసాద్



**కైకలూరు, జనవరి 31 (వార్తాప్రభ) :** ఆల్ ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యాన కైకలూరు నియోజకవర్గ స్థాయి డైరీ ఆవిష్కరణ శనివారం స్థానిక శ్యామలాంబ అమ్మ వారి ఆలయం వద్ద నిర్వహించారు. భారతదేశ నాగరికతను నిర్మించింది బీసీలేనని, బీసీలంటే బోర్న్ క్రియేటర్స్ అని, బీసీలే ఈ సమాజానికి వెన్నెముకని బి.సి.సంఘ జిల్లా నాయకులు కనుమూరి ఆంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం అందరూ ఐకమత్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు కరేటి నాగరాజు, పుట్టి గణేష్ బాబు, మోతుక్కూరి నాగరాజు కుమార్, అనగాని మల్లేశ్వరరావు, వల్లూరి సత్యనారాయణ, గంగుల VS రామాంజనేయులు, బి రామాంజనేయులు, తమ్మిరెడ్డి అప్పారావు, ఆలూరి నాగేశ్వరరావు, సిరిగిరి పిచ్చోడు డి జయరాం నాయుడు, రామకృష్ణ నాయుడు, వి రాజారావు, జి సముద్రుడు, బి శ్రీనివాసరావు, ఎన్ మల్లేశ్వరరావు, డి సాయిరాం, కందుల భోగేశ్వరరావు, జి వెంకటేశ్వరరావు, ఎం నాగరాజు, ఎన్ మహాలక్ష్ముడు, జి ఏసుబాబు, సి హెచ్ ఫణి కుమార్, చక్రవర్తి, కె వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన సంద్రం, వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా భీమేశ్వర స్వామి రథయాత్ర

-'శంభో శంకర 'అంటూ రథ యాత్రను ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్





**ద్రాక్షరామం,జనవరి 31 (వార్తాప్రభ) :** పంచరామక్షేత్రాల్లో ప్రముఖమైన ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రథయాత్ర కార్యక్రమం భక్త జన సందోహం.. వేదోక్త మంత్రోచ్ఛారణలు, శైవ ఆగమ శాస్త్ర పద్ధతుల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంలు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభిఒచారు. భక్తి పరవశంతో వేలాది మంది భక్తుల నడుమ స్వామివారి రథం ఊరేగుతూ ద్రాక్షారామ వీధులు భక్తి శబ్దాలతో మార్మోగాయి. శ్రీ భీమేశ్వర స్వామి కటాక్షం మనందరికీ దైవ బలమని, భక్తి, సేవ, సమర్పణే సమాజానికి పునాది అని పేర్కొన్నారు. రథయాత్రతో ద్రాక్షారామం ఆధ్యాత్మిక కాంతులతో విరాజిల్లిందని, ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సద్భావనను పెంపొందిస్తాయని మంత్రి తెలిపారు. దేవాలయాల అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకట దుర్గా భవాని, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, దేవస్థాన అధికారులు, వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, వేలాది మంది భక్తులు పాల్గొని రథయాత్రను ఘనంగా నిర్వహించారు.

# ఇంటి పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం

- ఇంటి పన్ను చెల్లించని వారి ఇంటి కుళాయి లకు డమ్మీలు బిగించండి
- ఆదేశాలు పాటించకపోతే సస్పెండ్ చేస్తాం
- గ్రామపంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన డి ఎల్ పి వొ రాఘవన్



**జి.కొండూరు,జనవరి 31 (వార్తాప్రభ) :** ఇంటి పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని, వంద శాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా అధికారు లు పనిచేయాలని డి ఎల్ పి వొ ఎల్ బి ఎన్ రాఘవన్ హెచ్చరించారు.మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శనివారం డిఎల్ పి వొ రాఘవన్ సందర్శించి గ్రామపంచాయతీ కార్యదర్శి,ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో ఏటుకూరి బసవలింగేశ్వర రావు, సిబ్బందితో కలిసి ఇంటి పన్ను వసూళ్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా డిఎల్ పి వొ గ్రామంలో ఇంటి పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. జి.కొండూరు గ్రామపంచాయతీ పరిధిలో ఒక కోటి 80 లక్షల రూపాయలు మేర ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉందని, ప్రతిరోజు 573 అసెస్మెంట్లు కింద రూ. 9.50 లక్షలు చొప్పున వసూలు చేయాలని, లేనిపక్షం లో సస్పెండ్ అవుతారని కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంటి పన్ను బకాయిలున్న ఆస్తి పన్నులను వెంటనే వసూలు చేయాలని, నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇంటి పన్ను చెల్లించని వారి ఇంటి కుళాయిలకు డమ్మీలు బిగించాలని డి ఎల్ పి వొ ఆదేశించారు.ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో పన్ను వసూళ్లపై అధికారు లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# కలెక్టరు చొరవతో క్షేమంగా స్వదేశానికి



**అమలాపురం,జనవరి 31 (వార్తాప్రభ) :** ఉపాధి నిమిత్తం మస్కట్ దేశానికి వెళ్లి అక్కడ సరైన ఉపాధి కల్పించకుండా ఏజెంట్ చేతిలో మోసపోయిన మామిడికుదురు మండలం,పెదపట్నం గ్రామానికి చెందిన పి. శ్రావణి దుర్గా భవానిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురా వడంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోన సీమ జిల్లా కలెక్టరు ఆర్ మహేష్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని శ్రావణి దుర్గా భవాని తండ్రి కె. ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కుటుంబ పోషణ భారంగా ఉండటంతో తన పెద్ద కుమార్తెను 2024 సెప్టెంబర్ నెలలో దసరద్ అనే ఏజెంట్ ద్వారా మస్కట్ దేశానికి పంపించారు. ఆమెకు వివాహం అయి ఉండగా, ఇద్దరు ఆడపిల్లలు కూడా ఉన్నారు. అయితే మస్కట్ వెళ్లిన అనంతరం సరైన పని కల్పించకుండా ఐదు ఇళ్లలో తిప్పిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. తాను అక్కడ పనిచేయ లేనని, స్వదేశానికి పంపించాలని కోరినప్పటికీ, ఆరు నెలలు పనిచేస్తేనే స్వదేశానికి పంపుతామని ఏజెంట్లు తెలిపారు. ఆరు నెలల అనంతరం సీత అనే ఏజెంట్‌ను సంప్రదించగా, ఇండియాకు పంపేందుకు రూ.60,000 చెల్లించాలని డిమాండు చేశారు. పరిస్థితులు అనుకూలించకపోవడంతో రూ.60,000 చెల్లించినప్పటికీ, ఆమెను పంపించేం దుకు వారు నిరాకరించారు.దీంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో జిల్లా కలెక్టరు కార్యాలయంలో సంప్రదించగా స్థానిక జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ను ఆశ్రయించాలని సూచించారు. ఫిర్యాదు అందుకున్న కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందం, సంబంధిత ఏజెంట్లతో చర్చలు జరిపి, అవసరమైన చర్యలు తీసుకుని శ్రావణి దుర్గా భవానిని సురక్షితంగా భారతావనికి తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం నోడల్ అధికారి కె. మాధవి, సమన్వయ అధికారి రమేష్ మాట్లాడుతూ, వలస కార్మికులు ఇలాంటి విపత్కర సమస్యలు ఉత్ప న్నమైనప్పుడు భయపడ కుండా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదిం చాలని వారు తెలిపారు.

# మారుతున్న కాలానుగుణంగా మత్స్యకారులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలి - జిల్లా మత్స్యశాఖ అధికారిణి సి.ఎస్.చక్రాణి

- చిన నందిగామలో శాస్త్రీయ విధానంలో మంచినీటి చేపల పెంపకంపై మత్స్య సాగు రైతులకు శిక్షణ









**జి.కొండూరు,జనవరి 31 (వార్తాప్రభ) :** మారుతున్న కాలానుగుణంగా మత్స్య సాగు రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని జిల్లా మత్స్యశాఖ అధికారిణి సి.ఎస్.చక్రాణి పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని చిన నందిగామ గ్రామంలోని మత్స్య శాఖ భవనంలో ఐసిఏఆర్, సిఐఎఫ్ఏ, ఆర్ఆర్ సి విజయవాడ వారి ఆధ్వర్యంలో శనివారం మత్స్య సాగు రైతులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సి.ఎస్. చక్రాణి శాస్త్రీయ విధానంలో మంచినీటి చేపల పెంపకంపై అవగాహన కల్పించారు.జిల్లా, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో మత్స్యరంగం ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మత్స్య శాఖ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీల గురించి వివరిస్తూ మత్స్య సాగు రైతులు పథకాలను ఉపయోగిం చుకోవాలని కోరారు.ఆర్ ఆర్ సి విజయవాడ కార్యాలయం ఇంచార్జ్, సీనియర్ సైంటిస్ట్ డా. రమేష్ రాథోడ్ మాట్లాడుతం చేపల చెరువుల తయురీ విధానంలో మత్స్య సాగు రైతులు చేపట్టవలసిన పద్ధతులు,పెంపకం విధానంలో తీసుకోవలిసిన జాగ్రత్తలు, వ్యాధులు,నిర్ధారణ, నివారణ చేపట్టాల్సిన పద్ధతులు గురించి వివరించారు. మండల మత్స్య అభివృద్ధి అధికారిణి బి.తేజస్విని మాట్లాడుతూ శాస్త్రీయ విధానంలో చేపల పెంపకం చేపట్టి మత్స్య సాగు రైతులు వారి జీవన ఉపాధి ఏ విధంగా మెరుగు పర్చాలో వివరించారు.చేపల చెరువులో నీరు ఏ విధంగా పరిరక్షించాలో మత్స్య సాగు రైతులకు ప్రత్యక్షంగా చూపించి, చేపల చెరువు పెంపకంలో నీటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.చేపల చెరువు తయారీ విధానం, చేప పిల్లల ఎంపిక, మార్కెట్ చేయడం గురించి రైతులతో చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో చేపల పెంపకం దారుల సంఘం అధ్యక్షులు పెండెం ఇశ్రాయేలు, ప్రధాన కార్యదర్శి, సంఘం మత్స్య సాగు రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాజ గ్రామంలోని 10,77,132 లక్షల నిధులు దుర్వినియోగం పై విచారణ కు ఆదేశించిన పంచాయితీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్.

**అవనిగడ్డ,జనవరి 31 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా, మొవ్వ మండలం, కాజ గ్రామ పంచాయితీలో దుర్వినియోగం కాబడిన రూ.10,77,132 లక్షల నిధులపై తగిన చర్యలు తీసుకోవలసినదిగా పంచాయితీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, పంచాయితీరాజ్ శాఖ కమీషనర్ వి.ఆర్. కృష్ణ తేజ. మైలవరపు ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి ది.29.12.2025 న తాను చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణకు ఆదేశించారన్నారు. ఈ మేరకు పంచాయితీరాజ్ శాఖ జాయింటు సెక్రటరి యమ్. కాటమ రాజు ఉత్తర్వులను జారీ చేసారు. గత సంవత్సరం ఈ నిధుల దుర్వినియోగం పై కూచిపూడి పోలీస్ స్టేషన్లో పంచాయితీ అధికారుల ఫిర్యాదు చేసినప్పటికి ఇప్పటి వరకు క్రిమినల్ కేసు నమోదు కాలేదు. రెవిన్యూ రికవరి చట్టం -1864 ప్రకారం దుర్వినియోగం కాబడిన నిధులు రూ. 10,77,132/- లను వసూలు చేయ్యాలని జి.ఓ.యమ్.యస్ నెం.458, తేది.22.09.2009 ప్రకారం ప్రభుత్వ సర్వీసు నుండి బిల్లు కలెక్టర్ యస్. సురేంద్ర బాబును తొలగించాలని పంచాయితీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి చేసిన ఫిర్యాదులో కోరానని జంపాన శ్రీనివాస గౌడ్ తెలిపారు.

# సైకిల్ కు ఓటేశారు...అభివృద్ధికి చోటిచ్చారు

-కుప్పంలో పేదల సేవలో కార్యక్రమం ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,జనవరి 31 (వార్తాప్రభ) :** గత ఎన్నికల్లో సైకిల్ కు ఓటేసి ప్రజలు అభివృద్ధికి చోటిచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గం గుడిపల్లె మండలం బెగ్గిలపల్లెలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. బెగ్గిలపల్లెలో ముగ్గురు లబ్దిదారుల నివాసాలకు వెళ్లిన సీఎం మునెమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛను, చిన్న తాయమ్మ అనే మహిళకు వితంతు పింఛను, వెంకట రామప్ప అనే లబ్ధిదారుకు వృద్ధాప్య పింఛను అందించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామానికి వెళ్లే మార్గంలో తనను చూసేందుకు తరలి వచ్చిన మహిళలకు సీఎం చంద్రబాబు అప్యాయంగా పలకరించారు. గ్రామస్థుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అంతకుముందు బెగ్గిలపల్లె మండల పరిషత్ పాఠశాల విద్యార్థులతో సీఎం ముచ్చటించారు. అనంతరం పేదల సేవలో ప్రజా వేదిక బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. దేశంలోని ఏ రాష్ట్రమూ ఇవ్వనంత సంక్షేమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందిస్తున్నామని సీఎం వివరించారు. ప్రతీ నెలా రూ. 2730 కోట్ల మేర పెన్షన్ల రూపంలో లబ్దిదారులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. పొరుగున తమిళనాడులో నెలకు రూ. 315 కోట్లు, కర్ణాటకలో రూ. 392 కోట్లు పెన్షన్లు నిమిత్తం ఖర్చు చేస్తున్నారని సీఎం అన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏపీలో పేదలకు ఏ స్థాయిలో పెన్షన్ అందచేస్తున్నామనేది గుర్తించాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని అన్నారు. ఎంత మంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం వర్తింప చేశామన్నారు. దీపం-2.0 పథకం కింద గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని వివరించారు. అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం కల్పించింది టీడీపీనే అని అన్నారు. ఆస్తిలో సమాన హక్కు ఎన్టీఆర్ కల్పిస్తే తాను 33 శాతం రిజర్వేషన్లను ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో అమలు చేసినట్టు వివరించారు. త్వరలో చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు రానున్నాయన్నారు. సమీప భవిష్యత్తులో మహిళలు ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులుగా ఎదుగుతారని అన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే లక్ష్యాన్ని మరింత పెంచుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం ఆకాంక్షించారు.

# ముక్తేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకుంటాం

–టిడిపి యువనాయకుడు, గద్దె చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గద్దె క్రాంతికుమార్



**విజయవాడ(జి.కొండూరు),జనవరి 31 (వార్తాప్రభ) :** క్యాన్సర్ వ్యాధితో మరణించిన టీడీపీ మాజీ నాయకుడు, బూత్ కమిటీ నాయకుడు సగ్గుర్తి ముక్తేశ్వరరావు (చంటి) కుటుంబాన్ని అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం, తమ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని టీడీపీ యువనాయకుడు, గద్దె చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గద్దె క్రాంతికుమార్ హామీఇచ్చారు. క్యాన్సర్‌తో సగ్గుర్తి ముక్తేశ్వరరావు జులై ఆరోతేదీ న పటమట ఎన్ఎస్ఎం స్కూలు రోడ్డు కౌండిన్యనగర్‌లో మృతిచెందారు. ముక్తేశ్వ రావు కు భార్య కీర్తి, కుమార్తె సాత్విక ఉన్నారు. వీరి కుటుంబాన్ని శనివా రం గద్దె క్రాంతికుమార్ పరామర్శించి ఓదార్చారు. ముక్తేశ్వరరావు, కీర్తిల కుమార్తె సగ్గుర్తి సాత్విక (8వ తరగతి) చదువు నిమిత్తం రూ.25 వేల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ద్వారా ముక్తేశ్వరరావు కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా విజయవాడ తూర్పు శాసనసభ్యులు డాక్టర్ గద్దె రామ్మోహనరావు కృషిచేస్తున్నారన్నారు. సగ్గుర్తి సాత్విక చదువుకు అయ్యే పూర్తిఖర్చు ను ఎమ్మెల్యే భరిస్తారన్నారు. దీనిలో భాగంగానే ఆర్థిక సహాయం చెక్కును అందజేశామన్నారు. పి4, ప్రభుత్వ పరంగా ఇప్పటికే కేటాయించిన గృహాన్ని కూడా త్వరలోనే కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే వితంతు పింఛను మంజూరు చేశామని తెలిపారు.త్వరలో మిగతా పథకాలు, సగ్గుర్తి సాత్విక చదువు నిమిత్తం అవసరమయ్యే ఆర్థిక సహాయం అందేలా అన్ని చర్యలు తీసుకుంటా మన్నారు.దీనికి తనవంతుగా కూడా సహకారాన్ని అందిస్తానని హామీఇచ్చారు.టీడీపీ 14వ డివిజన్ అధ్యక్షులు కన్నా రమేష్, రాఘవ, బద్రి, యల్లబాబు, పలువురు టిడిపి నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# వైసిపి తిరుపతి లడ్డు సంబంధిత పాప పరిహార సంప్రోక్షణ పూజలు





**విస్సన్నపేట,జనవరి 31 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కలగర రామచంద్రపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తిరుమలలో అడ్డుకు సంబంధించి సిబిఐ క్లీన్ చీట్ ఇవ్వడంతో వైసీపీ పార్టీ నాయకులు పాప పరిహార సంప్రోక్షణ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డు మహా ప్రసాదంకు సంబంధించి జంతు కొవ్వును వాడారని రకరకాల ప్రచారం చేశారని న్యాయస్థానాలు సిబిఐ కూడా అవి అన్ని పుకార్లు అని చెప్పి కొట్టివేసిన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే ఇంకా రకరకాల ప్రచారం చేస్తుందన్నారు. అధికారంలో ఉన్న వ్యక్తులు హిందువుల మనోభావాలతో ఆటలాడుకోవడం వైకుంఠ వాసుని మహాప్రసాదంలో పందికొవ్వు, జంతువుల కొవ్వు కలిసిందని చెప్పటం రాజకీయాల కోసం దేవుడిని కూడా రోడ్డుకు లాగటం జరగని ఒక సంఘటన జరిగిందని గ్లోబల్ ప్రచారం చేయడం గుడిమెట్లు కడగటం వంటి గ్లోబల్ ప్రచారాలు చేసి నేడు జనంలోకి రాలేక నాయకులు ఉంటున్నారు అన్నారు. వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలలో పాపప్రక్షాలన ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అంతఃకరణ శుద్ధిగా ఆత్మ ప్రబోధానుసారం ఆపదమొక్కులవాడు అనాథ రక్షకుడైన ఆ శ్రీనివాసుని మహా లడ్డు ప్రసాదం విషయంలో ఎవరూ కూడా తప్పు చేయరని చేస్తే వారికి పుట్టగతులు ఉండమన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఎవరూ చేయరని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు,ఎంపీపీ గద్దల మల్లయ్య, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు,తిరువూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దేశి రెడ్డి శ్రీనివాస రెడ్డి, దామోదర రెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తానంకి రాంబాబు, చండుపట్ల గ్రామ సర్పంచి బాలకొండయ్య, విస్సన్నపేట పట్టణ వైసీపీ అధ్యక్షులు ఎన్ వి కుటుంబరావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి శిరసాని ప్రకాష్,పిల్లి రాజేష్, మేకల రవి, ఏ లాలయ్య,కే తిరుపతిరావు ముంగా జయరాజు పి లక్ష్మయ్య జయకర్ తదితరులు పాల్గొన్నారు.

# తపాలాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

**కాకినాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** ప్రజల సౌకర్యార్థం ఫిబ్రవరి 2 నుంచి 11 వ తేదీవరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె. కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల్లో ఆధార్ నమోదు, డెమోగ్రాఫిక్స్ అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్ సేవలందిస్తారన్నారు. 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17సంవత్సరాల వయసుగల పిల్లలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్లు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. కాకినాడ ఇంజనీరింగ్ కాలేజి, జగన్నాథపురం, గాంధీనగర్, ఏపీఎస్పీ క్యాంప్, తుని, పెద్దాపురం, శంఖవరం, పిఠాపురం, జి.మామిడాడ, జగ్గంపేట, అడ్డతీగల పోస్టాఫీసుల్లో ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారని, ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మాదకద్రవ్యాల నివారణ పై కలసికట్టుగా పని చేద్దాం - మెరైన్ ఇన్స్పెక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి




**కాకినాడ,జనవరి 31 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ , పీజీ కళాశాల విద్యార్థులకు మెరైన్ పోలీసు శాఖ వివిధ రక్షణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు తెలిపారు. మెరైన్ డిపార్ట్మెంట్ ఉత్తర్వుల మేరకు కాకినాడ అటవీ శాఖ, కోస్టు గార్డు, నేవీ, ఎస్పీఎఫ్ వంటి రక్షణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ వ్యసనాలకు బానిస కాకూడదని, దేశ ప్రగతికి నాంది పలకాలని, విద్యార్థులు లక్ష్యసాధనకే కృషి చేస్తూ తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెరైన్ ఇన్స్పెక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గంజాయి నిర్మూలన కోసం, సముద్ర తీర ప్రాంతంలో పాటించవలసిన నియమాల కోసం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కొత్త వారితో పరిచయాలు వద్దని, ఏదైనా ఆశ చూపించే వారిని అసలు నమ్మవద్దు అని, తల్లిదండ్రులే ప్రధానమని పిలుపునిచ్చారు.మత్తు పదార్థాల కేసులకు సంబంధించినటువంటి శిక్షలను, 1972 టోల్ ఫ్రీ నెంబర్ యొక్క ప్రాధాన్యతను తెలిపారు. యువతే లక్ష్యంగా మత్తు పదార్థాల వాడకం జరుగుతుందని విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వాడకం చాప కింద నీళ్లు వ్యాపిస్తుందని, వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ పరంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని కనుక ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు.విద్యార్థి తమ లక్ష్యాలను ఎన్నటికీ వదలకూడదని ఉన్నత ఉద్యోగాలను సాధించాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి తేజేశ్వరరావును, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను పోలీసు అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బివిస్ పద్మజ,మెరైన్ ఎస్ఐ సురేష్, ఇండియన్ నేవీ ఆఫీసర్ సంజీవ్ కుమార్ ఇండియన్ కోస్టు గార్డు ఆఫీసర్ బల్జిత్, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ పి శాంతి ఈశ్వరరావు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ శాఖ విభాగాలను, ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188